ప్రమాదం-1



సమయం : ఆదివారం వేకువజామున 4.30 గంటలు

ప్రాంతం : ఒంగోలులోని కొప్పోలు ఫ్లైఓవర్ దాటిన తర్వాత దక్షిణం వైపు 500 మీటర్ల దూరంలో..

ఏం జరిగిందంటే : పంక్చర్ అయి ఆగి ఉన్న లారీని హైదరాబాద్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కోడి గుడ్ల లారీ ఢీకొట్టింది. దాన్ని వెనుక నుంచి వస్తున్న మరో లారీ (వరి కోత మిషన్‌తో) ఢీకొట్టింది. దీంతో కోడిగుడ్ల లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, ఇద్దరు సహాయకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు.

ప్రమాదం-2



సమయం : ఆదివారం వేకువజామున 4.35 గంటలు

ప్రాంతం : ఒంగోలులోని కొప్పోలు ఫ్లైఓవర్ దాటిన తరువాత 300 మీటర్ల దూరంలో..

ఏం జరిగిందంటే : తొలి ప్రమాదంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డుకు ఒకవైపు చివరన ఇన్నోవా నిలిచిపోయింది. ఆ సమయంలో ఇసుక ట్రాక్టర్ యూటర్న్ చేసుకుంటుండగా దానితోపాటు, కారును వెనుక నుంచి వస్తున్న మినీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు.

ప్రమాదం-3



సమయం : ఆదివారం వేకువజామున 4.40 గంటలు

ప్రాంతం : ఒంగోలులోని కొప్పోలు ఫ్లైఓవర్ దాటిన తరువాత 100 మీటర్ల దూరంలో..

ఏం జరిగిందంటే : ట్రాఫిక్ నిలిచిపోవడంతో తమిళనాడు వైపు వెళ్లే లారీ, దాని వెనుక కారు ఆగి ఉన్నాయి. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో లారీ.. నిలిపిఉన్న కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న తల్లీకొడుకు తీవ్రగాయాలపాలయ్యారు. ఆస్పత్రికి తరలించాక కన్నుమూశారు. అదేకారులోని మరో నలుగురికి గాయాలయ్యాయి.

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిలో ఒంగోలు తూర్పు బైపాస్‌పై ఆదివారం పది నిమిషాల వ్యవధిలో 500 మీటర్ల పరిధిలో ఈ వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఐదుగురు మృతిచెందారు. ఏడుగురికి గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మృతుల్లో ముగ్గురు నెల్లూరు జిల్లా, ఇద్దరు గుంటూరు జిల్లా వాసులుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలతో జాతీయ రహదారి రక్తసిక్తమైంది. మృతదేహాలు, రెండు లారీల మధ్య చిక్కుకొని నుజ్జునుజ్జయిన కారు, తీవ్రంగా ధ్వంసమైన కోడిగుడ్ల లారీ, దెబ్బతిన్న ఇటుక ట్రాక్టర్‌తో ఘటనా స్థలంలో భీతావహ వాతావరణం నెలకొంది.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కోడిగుడ్ల లారీ

తెల్లారిన బతుకులు

ఒకేచోట 10 నిమిషాల్లో 3 వరుస ప్రమాదాలు

ఐదుగురు దుర్మరణం
మృతుల్లో తల్లీకొడుకు
ఏడుగురికి గాయాలు

- వారిలో భార్యాభర్తల పరిస్థితి ఆందోళనకరం
- ఒంగోలు వద్ద జాతీయ రహదారిపై ఘటనలు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ దామోదర్



కోడిగుడ్ల లారీ బోల్తా పడటంతో మృతి చెందిన బాబు, నాగేంద్ర, రమణయ్య

ఒంగోలు క్రైం / కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఒకరిది భక్తి. మరొకరిది బతుకు దెరువు. తెల్లారేలోపు వారి బతుకులు తెల్లారిపోయాయి. కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మూడు వరుస ప్రమాదాలు నాలుగు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. అతివేగమే ప్రమాదాలన్నింటికీ కారణమైంది. తొలుత పంక్చరై ఆగి ఉన్న వాహనాన్ని కోడిగుడ్ల లారీ ఢీకొట్టడం, దాన్ని ఆ వెంటనే వెనుక నుంచి వరికోత మిషన్‌తో వస్తున్న లారీ ఢీకొట్టడంతో కోడిగుడ్ల లారీ బోల్తా కొట్టింది. అందులో ఉన్న నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకు చెందిన రావినూతల బాబు (42), రావినూతల నాగేంద్ర (18), నెల్లూరు టౌన్‌లోని వెంగళరావునగర్‌కు చెందిన డ్రైవర్ షేక్ రహీం అలియాస్ రమణయ్య (60) మృతి చెందారు. వరికోత మిషన్‌తో వెళ్తున్న వాహనంలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది.

గంటన్నరపాటు నిలిచిన ట్రాఫిక్

వరుస ప్రమాదాలతో నెల్లూరు వైపు వెళ్లే వాహనాలు వేకువజామున 4.30 గంటల నుంచి 6 గంటల వరకూ దాదాపు గంటన్నరసేపు జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గుంటూరు వైపు వెళ్లే అన్ని వాహనాలను పాత బైపాస్ రోడ్డు నుంచి నెల్లూరు వైపు మళ్లించారు. అనంతరం ప్రమాదాలకు గురైన వాహనాలను తొలిగించి రాకపోకలను పునరుద్ధరించారు.

పనిలో.. చావులో కలిసే ప్రయాణం..

నెల్లూరులోని కోడిగుడ్ల వ్యాపారి వద్ద ఒకరు డ్రైవర్‌గా, మరో ఇద్దరు హెల్పర్‌లుగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. నిత్యం కలిసి ఉండేవారు ఒకేసారి ప్రాణాలు కోల్పోయారు. కోడిగుడ్ల వ్యాపారి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న రమణయ్య, బాబు, నాగేంద్రలు హైదరాబాద్ వెళ్లి కోడిగుడ్లను లోడ్ చేసుకుని తిరిగి నెల్లూరు వెళ్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. రమణయ్యకు భార్య నలుగురు సంతానం ఉన్నారు. వీరిలో ఒక అమ్మాయికి పెళ్లిచేసి అత్తారింటికి పంపారు. ఒక అబ్బాయి, ఇద్దరు కూతుళ్లు ఉండగా వారికి రమణయ్య పెద్దదిక్కు. ఆయన పనిచేసి పైసలు తెస్తేనే వారి కుటుంబం గడిచేది. మరో మృతుడు బాబుకు భార్య, ఇంటర్ చదువుతున్న కుమార్తె, ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. మరో మృతుడు నాగేంద్ర కోడిగుడ్లు అమ్మే వాహనానికి హెల్పర్‌గా వెళుతూ వృద్ధులైన తల్లిదండ్రులకు అండగా ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో నాగేంద్ర ప్రాణాలు కోల్పోవడంతో ఆయన తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

పుట్టెంట్రుకుల కోసం తిరుపతి వెళ్తూ..



పావని, చంద్రకౌషిక్‌ల మృతదేహాలు

రెండేళ్ల చిన్నారి పుట్టెంట్రుకుల కోసం రెండు కుటుంబాలు కారులో వెళుతున్నాయి. తొలి ప్రమాదంతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో తమ కారును రోడ్డుపక్కనే నిలిపారు. దాని ముందు ఇంకో లారీ నిలిపి ఉంది. ఆ సమయంలో వేగంగా వెనుక నుంచి వచ్చిన మరో లారీ వారి కారును ఢీకొట్టింది. దీంతో రెండు లారీల మధ్య కారు చిక్కుకొని నుజ్జునుజ్జయ్యింది. అందులో ఉన్న గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తిరుమలశెట్టి పావని (42), ఆమె కుమారుడు చంద్రకౌషిక్ (16), పావని భర్త వెంకటేశ్వర్లు, ఆమె బంధువులైన బూసి వినయ్‌దేవ్, లావణ్య (దంపతులు)లతోపాటు దంపతుల కుమారుడు లోక్షిత్‌కు గాయాలయ్యాయి. వారిని పోలీసులు వైద్యశాలకు తరలించగా పావని, కౌషిక్ మృతి చెందారు. వినయ్ తలకు గాయం కావడంతో ఒంగోలు ప్రైవేటు వైద్యశాలలో ఆపరేషన్ చేశారు. లావణ్యను మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మృతుల్లో ఒకరైన చంద్రకౌషిక్ ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో 570 మార్కులు సాధించారు.

ఇటుకల ట్రాక్టర్ వెనక్కి తిరగడం వల్ల మరో ప్రమాదం

తొలి ప్రమాదంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఇటుక రాళ్ల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్ కొద్ది దూరంలో వెనక్కి వెళ్లి సర్వీసు రోడ్డులోకి మలుపుతిరిగే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో మినీ లారీ అతివేగంగా వచ్చి ట్రాక్టర్‌ను, రోడ్డు పక్కనే నిలిపి ఉన్న ఇన్నోవా కారును ఢీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇన్నోవాలో ఉన్నవారు క్షేమంగా బయటపడ్డారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్ చెప్పారు. అక్కడే ఉన్న రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీలతో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను గుర్తించి రెండు రోజుల్లో అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విలేకరులకు చెప్పారు. ఆయన వెంట అదనపు ఎస్పీ కె.నాగేశ్వరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు అజయ్‌కుమార్, పాండురంగారావు, సురేష్, నాగరాజు, మేడా శ్రీనివాసరావు సిబ్బంది ఉన్నారు.

వేధింపులు తాళలేక
భర్తను హత్య చేసిన భార్య

- మద్యం మత్తులో ఉండగా గొంతుకు టవల్ బిగించి కడతేర్చిన వైనం
- సహజ మరణంగా చిత్రీకరించే యత్నం
- పోలీసుల అదుపులో నిందితురాలు

7

వీరయ్య చౌదరి హత్య కేసులో
మరో అడుగు

- పోలీసుల అదుపులో కీలక పాత్రధారి

ఒంగోలు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన ఇసుక వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్లు తెలిసింది. ఆయన్ను విచారిస్తున్నట్లు సమాచారం. దీంతో కేసులోని చిక్కుముడులు వీడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. హత్యకు పథక రచన చేయడంతోపాటు, సుపారీ కూడా ఆయనే మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. వీరయ్య హత్య అనంతరం ఒంగోలు వదిలి పరారైన ఇసుక వ్యాపారి కనీసం సెల్‌ఫోన్ కూడా వినియోగించలేదు. దీంతో ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు 11 రోజులుగా వేట సాగించారు. అన్ని వైపుల నుంచి సమాచారం తెప్పించుకున్నారు. ఈక్రమంలో సదరు ఇసుక వ్యాపారి నెల్లూరులోని ఓ న్యాయవాదికి ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఆవైపు కూడా దృష్టిసారించారు. ఇలా అన్నివైపుల నుంచి పొగపెట్టడంతో కలుగులో నుంచి బయటకు వచ్చేందుకు నిందితుడు ప్రయత్నించాడు. ఈక్రమంలో పొరుగు జిల్లాలో ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేరుగా హత్యలో పాల్గొన్న నేరచరిత్ర కలిగిన మరో ఇరువురి కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. వారెవర్నది కూడా గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే కొందరు సూత్రధారులను అదుపులోకి తీసుకొన్నారు. మరికొందరి పాత్రపై కూడా విచారిస్తున్నారు. సుపారీకి సంబంధించిన నగదు ఇసుక వ్యాపారికి ఎవరి వద్ద నుంచి అందింది, అంత మొత్తం ఇవ్వడంలో ఎవరెవరి భాగస్వామ్యం ఉందన్న కోణంలో సమాచారాన్ని సేకరిస్తున్నారు. కీలక సూత్రధారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో కొద్దిరోజుల్లోనే కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.



వీరయ్య భౌతికకాయాన్ని పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత (ఫైల్)

అందుబాటులో హైస్కూళ్లు

- కొత్తగా 82 ఉన్నత పాఠశాలలు
- జూన్ నుంచి అమలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని విద్యార్థులకు సెకండరీ విద్య (హైస్కూలు) మరింత చేరువ కానుంది. చదువు కోసం దూర ప్రాంతాలకు వెళ్లే సమస్య తీరనుంది. గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవోను రద్దు చేసి ప్రత్యామ్నాయంగా చేపట్టిన పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ జిల్లాలో హైస్కూళ్ల కొరత తీర్చనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అదనంగా కొత్త హైస్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నారు. ప్రాథమికోన్నత స్థాయి (8వ తరగతి)తో తమ చదువుకు స్వస్తి చెప్పకుండా సెకండరీ విద్య పూర్తి చేసేందుకు వీలు కలగనుంది.

ఒంగోలు విద్య, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా 82 హైస్కూళ్లు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. 86 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అవుతున్నాయి. ఈ హైస్కూళ్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడటమే తరువాయి. జిల్లాలో ప్రస్తుతం జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్లలో మొత్తం 381 హైస్కూళ్లు ఉన్నాయి. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణలో 60 మందికిపైగా విద్యార్థులతో 6,7,8 తరగతులు ఉన్న యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయమన్నారు. అటువంటివి జిల్లాలో 82 యూపీ స్కూళ్లు ఉన్నాయి. ఇవన్నీ హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ అవుతున్నాయి. ఈ యూపీ స్కూళ్లలోని ప్రాథమిక తరగతులు 1 నుంచి 5 తరగతులు కూడా ఇవే పాఠశాలలో కొనసాగుతాయి. అప్‌గ్రేడ్ అయ్యే యూపీ స్కూళ్లలో 1నుంచి 5 తరగతులు మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా, ఆరు యూపీ స్కూళ్లలో బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా కొనసాగనున్నాయి. కనిగిరి మండలంలో అత్యధికంగా ఐదు యూపీ స్కూళ్లు హైస్కూళ్లు కానున్నాయి. కొత్తగా ఆవిర్భవించే 82 హైస్కూళ్లలో మూడు ఉర్దూ మీడియం హైస్కూళ్లు ఉన్నాయి.



కొత్త స్కూళ్లు ఇవే...

వివిధ మండలాల్లో 82 యూపీ స్కూళ్లు హైస్కూళ్లుగా ఆవిర్భవిస్తున్నాయి. మొహిద్దీన్‌పురం, కొప్పెరపాడు, ముక్తేశ్వరం, వల్లాపల్లి, కొత్తమల్లాపురం, మోక్షగుండం, సింగరపల్లి, చంద్రపాడు, పులికొండ, సంతరావూరు, కందులాపురం, హజరత్‌గూడెం, శేషంవారిపాలెం, బండివెలుగండ్ల, ఈస్ట్ వీరాయపాలెం, త్రిపురసుందరీపురం, అంబవరం, ఆరవవార్డు యాదవబజారు, బురుజుపల్లి, అడవిరాజుపాలెం, పోట్లూరు, తెట్టు, నాగండ్ల, కొండమూరు, కోటపాడు, రేణంగివరం, పాలూరు, ఖాజీపురం, మహబూబ్‌నగర్, బడుగువేరు, యడవల్లి, తుమ్మగుంట చాకిరాల, మాచవరం, బొడ్డువానిపల్లి, వెలిగండ్ల, నాగంపల్లి, తమ్మవరం, రాజుపాలెం, వెస్ట్‌వీరాయపాలెం, అగ్రహారం, వెస్ట్ గంగవరం, జమ్మనపల్లి, గోగులదిన్నె, చింతగుంట, 10వ వార్డు కెల్లంపల్లి ఉన్నాయి. కేజీ కండ్రిక, చిమట, సుంకరవారిపాలెం, పెద ఉల్లగల్లు, శంకరాపురం, శింగనపాలెం, వెంగముక్కలపాలెం, యరజర్ల, చిన దోర్నాల, వెస్ట్ కట్టకిందపల్లి, నర్రమారెళ్ల, మోపాడు, పర్చూరు, తంగిరాలపల్లి, బట్టువారిపల్లి, కంభాలపాడు, పార్వతీపురం, శతగోడు, కొప్పరం, ఏల్చూరు ముస్లిం, కొమ్మాలపాడు, శానంపూడి, తురకపాలెం, రజానగరం, వెలుగువారిపాలెం, కందులూరు, గానుగుపెంట, వెల్లంపల్లి, అలగాయపాలెం, కలూరివారిపాలెం, కొణిజేడు, చేనేతపురి, కొత్తపేట యానాదికాలనీ, ఆమోదగిరిపట్నం, యర్రగొండపాలెం, కొత్తగోళ్ల, వెడిపి యూపీ స్కూళ్లు అప్‌గ్రేడ్ అయ్యి హైస్కూళ్లు కానున్నాయి.

ఆరోగ్యం అరచేతిలోనే..

- నేడు హ్యాండ్‌వాష్ దినోత్సవం
- చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం
- గత ఐదేళ్లలో పాఠశాలల్లో కనిపించని కార్యక్రమం



7



పరీక్షకు ఆలస్యమవడంతో పరిగెడుతున్న విద్యార్థిని

సజావుగా నీట్ పరీక్ష

- క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతి
- ఒక్కో కేంద్రానికి ఇన్‌చార్జిగా తహసీల్దార్
- 96.94శాతం మంది విద్యార్థులు హాజరు
- సెంటర్‌లను తనిఖీ చేసిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలులోని ఐదు కేంద్రాల్లో నీట్ పరీక్ష ఆదివారం సజావుగా నిర్వహించారు. ఒక్కో సెంటర్‌ను పర్యవేక్షించేందుకు ఒక తహసీల్దార్, ఒక ఎస్‌ఐని నియమించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకున్నారు. ఐదు కేంద్రాలకు 1.473 మంది విద్యార్థులను కేటాయించగా 45 మంది గైర్హాజరయ్యారు. 96.94శాతం మంది హాజరయ్యారు. డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా తనిఖీ చేశారు. వివరాలు 7వ పేజీలో..

వేమవరం రహదారికి మహర్దశ

● మంత్రి స్వామి చొరవతో రూ.కోటి మంజూరు



శిథిలమైన కల్వర్టు

మర్రిపూడి, మే 4 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి గార పేట ఆర్‌అండ్‌బీ రహదారి అభివృద్ధికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి కోటి రూపాయల నిధులు మంజూరు చేయించారు. గ్రామ సచివాలయం నుంచి ఈ నిధులతో 7 మీటర్ల వెడల్పుతో సిమెంట్‌రోడ్డు నిర్మించనున్నారు. ఈ రహదారి గతంలో కొద్దిపాటి వర్షాలకు సైతం కాలుతీసి కాలు పెట్టలేని చందంగా ఉండేది. పేరుకే ఆర్‌అండ్‌బీ రహదారి అయినప్పటికీ గ్రామంలో అధ్వానంగా ఉండేది. కల్వర్టులు శిథిలమై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందేవారు. స్థానిక రామాలయం ఎదురుగా 20 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుకు మధ్యలో పెద్దరంధ్రం ఏర్పడి ప్రమాదభరితంగా తయారైంది. పంచాయతీ అధికారులు చొరవతీసుకొని తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజల అవస్థలను తప్పించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తోంది. మండలంలోని చిలంకూరు, ఓఎన్‌రోడ్డు కొండపి రహదారి అభివృద్ధికి సైతం మంత్రి స్వామి నిధులు మంజూరు చేయించారు. కేవీఎన్‌రోడ్డు అభివృద్ధి కోసం రూ.2.90కోట్లు, వేమవరం రోడ్డుకు కోటి నిధులు మంజూరు కావడంతో త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ అనంతరావు తెలిపారు. వేమవరంలో శిథిలావస్థకు చేరిన కల్వర్టును పునర్నిర్మిస్తామని తెలిపారు.

ఆరో రోజుకు చేరిన నిరవధిక సమ్మె



కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సీహెచ్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ పరిధిలో గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలని, 23శాతం ఇంక్రిమెంట్ మంజూరుతో పాటు ఇతర బెనిఫిట్స్‌ను అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్దిష్టమైన జాబ్‌చార్టు అమలు చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల గత నెల జీతం నిలుపుదల చేయడం హేయమైన చర్యని మండిపడ్డారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్రీకాంత్, జిల్లా సెక్రటరీ ప్రసన్న, జీవన్‌జ్యోతి, రామాంజనేయులు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు ఎప్పుడో..?

కొప్పోలురోడ్డులో మార్కింగ్ వేసి నెలలు గడుస్తున్న వైనం

కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం



ఇందిరకాలనీ వద్ద గృహాలను వేసిన మార్కింగ్

ఒంగోలు(రూరల్), మే4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ రోడ్డు మార్జిన్లలో పులివెంకటరెడ్డి కాలనీ, ఇందిరకాలనీ వద్ద నుంచి కొప్పోలు వరకు అక్రమంగా గృహాలు నిర్మించారు. దీంతో రోడ్డు కుచించుకుపోయి వాహనదారులు ప్రతిరోజు ప్రమాదాల బారినపడుతున్నారు. దీనికితోడు రోడ్డు అక్రమణలతో డ్రైనేజీ లేక మురుగు నీరు రోడ్డుపై నిలిచి గుంతలమయంగా మారుతోంది. దీనివల్ల వాహనదారులు ఈ గుంతల్లో పడి ఆస్పత్రి పాలవుతున్నారు. ఈక్రమంలో పులివెంకటరెడ్డికాలనీ నుంచి కొప్పోలు వరకు రోడ్డు వెంట డ్రైనేజీ కాలువను నిర్మించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం రూ.2కోట్లు నిధులు కూడా మంజూరు చేశారు. తదనంతరం కార్పొరేషన్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ సంయుక్తంగా రోడ్డు సర్వే చేశారు. కొన్నిచోట్ల రోడ్డు మార్జిన్లు 30అడుగులు, మరి కొన్ని చోట్ల 40 అడుగులు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఈక్రమంలో అక్రమ నిర్మాణాల తొలగింపు కోసం మార్కింగ్ కూడా చేసి నోటీసులు కూడా ఇచ్చారు. అయినప్పటికీ మార్జిన్‌లలో గల నిర్మాణాలను ఆక్రమణదారులు తొలగించలేదు ఈక్రమంలో గత నెల 30వ తేదీన డ్రైనేజీ నిర్మాణం కోసం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శిలాఫలకం ఆవిష్కరించారు. అయితే ఆక్రమణలను తొలగించి డ్రైనేజీ నిర్మాణాలను త్వరగా చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా చేజర్లమ్మతల్లి తిరునాళ్ల



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

ఒంగోలు(రూరల్), మే4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం చేజర్లలోని చేజర్లమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తిరునాళ్లకు వేలాదిగా తరలివచ్చారు. జీవాలను పోషకులు దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు. ఈ సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఈ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

కారు- పాలవ్యాన్ ఢీ.. నలుగురికి గాయాలు

మార్కాపురం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుంట్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కారు, పాలవ్యాన్ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళుతున్నారు. పాలవ్యాన్ మార్కాపురం నుంచి కంభంకు వెళ్తున్నది. మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామ సమీపంలో కారును ఎదురుగా వస్తున్న పాలవ్యాను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న శివశంకర్, అరుణ, రాజేశ్వరి, ఫణీంద్ర గాయపడ్డారు. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు

దొనకొండ, మే 4(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలంలోని వద్దిపాడు గ్రామంలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా విక్రయిస్తున్న 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై ప్రతిరోజు దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల 76 బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేసి సుమారు 860 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులను పట్టుకొని 18 కేసులు నమో దు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహించినా, మద్యం అమ్మకాలు జరిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తి

చీమకుర్తి మండలంలో 8 కేటగిరీలుగా 64 స్కూళ్లు ● 301 పోస్టులు మంజూరు ● ఒకటి మిగులుగా గుర్తింపు

చీమకుర్తి, మే4(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలపరిధిలో ప్రభుత్వ పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ కసరత్తు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. ఉపాధ్యాయుల కోరిక మేరకు ఎన్నికల నాటి హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం జీవో నంబర్ 117 రద్దు చేసి ప్రత్యామ్నాయంగా పాఠశాలల పునరీకరణను చేపట్టింది. ఈక్రమంలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టనున్నారు. మండలంలో పాండురంగాపురం, పుట్టచెరువుపాలెం పాఠశాలలు గతంలోనే మూతపడగా ఇక మిగిలిన 64 పాఠశాలలను ఎనిమిది కేటగిరీలుగా విభజించారు. ఈ పాఠశాలల్లో సబ్జెక్టులు, కేటగిరి వారిగా 301 టీచర్ పోస్టులు మంజూరు అవగా 300పోస్టులు కొత్త లెక్కల ప్రకారం అవసరం ఏర్పడింది. మొత్తం మీద ఒక పోస్టు మిగులుగా తేలింది. కాగా ఆయా పాఠశాలలకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు 9మంది అవసరం కాగా 9 పోస్టులు ఉన్నాయి. మిగులు పోస్టులు తెలుగు-2, ఇంగ్లీషు-4, గణితం-6, పీఎస్-2, బీఎస్-3, ఎస్ఎస్-2, పీడీ-1 మొత్తం 20గా లెక్క తేల్చారు. అవసరమైన పోస్టులుగా పీఎస్(ఉర్దూ)-1, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం-16, ఎస్‌జీటీ-2 మొత్తం 19గా గుర్తించారు. ఇలా అన్ని రకాల కేటగిరీలను కలిపి ఒక పోస్టు మిగులుగా గుర్తించారు. కాగా చంద్రపాడు, పులికొండ ప్రాథమికోన్నతపాఠశాలలు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయ్యాయి. పల్లామల్లితో పాటు పలు హైస్కూళ్లలో మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



హైస్కూల్‌కి అప్‌గ్రేడ్ అయిన చంద్రపాడు యూపీ స్కూల్

పునర్‌వ్యవస్థీకరణ తరువాత మండలంలోని స్కూళ్ల వివరాలు

మోడల్ ప్రైమరీ పాఠశాలలు	-17
ఫండమెంటల్ పాఠశాలలు-	- 9
బేసిక్ ప్రైమరీ పాఠశాలలు	-24
ప్రాథమికోన్నత పాఠశాలలు	- 3
ఉన్నత పాఠశాలలు	- 5
మోడల్ ప్రైమరీతో హైస్కూల్స్	- 2
బేసిక్ ప్రైమరీతో హైస్కూల్స్	- 2
మోడల్ ప్రైమరీతో ప్రాథమికోన్నత పాఠశాలలు	- 2

గిరిజనులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

● ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



సదస్సుకు హాజరైన ఎమ్మెల్సీ రవిబాబు, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు, నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మైదాన ప్రాంత గిరిజనులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు కోరారు. ఆదివారం ఒంగోలులో జరిగిన మైదాన గిరిజన సదస్సుకు హాజరైన వారు మాట్లాడుతూ ఎరుకుల, యానాదులు, చెంచులు, కమ్మర్లు, సుగాలీలకు రాజకీయాలలో ప్రాధాన్యత ఇచ్చి అసెంబ్లీలలో టికెట్‌లు ఇవ్వాలన్నారు. వారికి అవకాశం కల్పించినపుడే మైదాన గిరిజనుల సమస్యల పరిష్కారం అవుతాయని చెప్పారు. జగన్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రకారం రాష్ట్రంలో మొత్తం జనాభా 4.32 కోట్లు ఉంటే అందులో ఎస్టీలు 25,34,795 మంది ఉన్నారని, అందువల్ల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాయలసీమ, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలో మైదాన ప్రాంత గిరిజన ప్రాంతాలలో ఎస్టీలకు నియోజకవర్గాల ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రతి ఏటా గిరిజననుల సంక్షేమ బడ్జెట్ ప్రకటిస్తున్న వాస్తవంలో కార్యరూపం దాల్చడం లేదని విమర్శించారు. చట్టసభల్లో గిరిజనులకు అవకాశం కల్పించాలని, ఉపాధి, అభివృద్ధి, సంక్షేమ ప్రత్యేక పథకాలు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త, బక్కా పరంజ్యోతి, రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన మైదాన సంఘం జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

కాపు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

● ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాపు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో కన్వీనర్ వీరప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో కమిటీ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కొల్లా సుఖదేవ్, సుంకర తిరుమలనాయుడు, కోశాధికారి పెద్దిశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా సిరిగిరి రామచంద్ర, వాసాల ప్రసన్నకుమార్, సిరిగిరి శ్రీనివాసరావు, జి.ఆంజనేయులు, సాదు నరసింహరావు, జాయింట్ సెక్రటరీలుగా బ్రహ్మయ్యనాయుడు, సోమశేఖర్, నిశంకం బ్రహ్మయ్య, రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధిగా పసుపులేటి అనురాధ, అడ్వయిజర్ కమిటీలో చిట్టెం వెంకటేశ్వర్లు, మారుతి ప్రసాద్, దండే వెంకటేశ్వరరావు, కొల్లా హనుమంతరావులను ఎన్నుకున్నారు. అంతకు ముందు జరిగిన సభలో ఏపీ కమర్షియల్ ట్యాక్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ కొప్పోలు సుధాకర్ మాట్లాడుతూ కాపు ఉద్యోగుల స మస్యలను సామరస్యంగా పరిష్కారం చేసే దిశగా కాపు ఉద్యోగుల వెల్ఫేర్ సంఘం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ విద్యుత్ సర్వీసెస్ జనరల్ సెక్రటరీ తంగా సాంబశివరావు, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ జాయింట్ సెక్రటరీ వరదా కృష్ణారావు, సంఘం వ్యవస్థాపకులు జేష్ఠ వరప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారిశెట్టి రామమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదిక ఏర్పాటు అభినందనీయం

● టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్



మాట్లాడుతున్న శాంతారామ్

ఒంగోలు కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించడం అభినందనీయమని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్ పేర్కొన్నారు. ఒంగోలులోని పద్మావతి ఫంక్షన్‌హాలులో ఆదివారం నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ ఐదవ పరిచయ వేదిక జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాంతారం విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది వధూవరులకు సంబంధించిన బయోడేటాలు రావడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగం, కుల వృత్తులు చేసుకుంటూ యువతీ, యువకులను ఒక దగ్గరకు చేర్చి వివాహ సంబంధాలను కుటుంబ బంధాలుగా చేస్తున్న జిల్లా నాయీబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాలగురుస్వామి, డాక్టర్ వెంకటరమణ, కె.వీరాంజనేయులు, వేదిక కన్వీనర్ రాఘవ, పోతకమూరి మధుబాబు, గుంటూరు ఆదియ, గుంటూరు రాంబాబు, పెళ్ళూరు చిన వెంకటేశ్వర్లు, నిడమానూరు రమేష్, అన్నవరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

97మంది శ్రీహర్షిణి విద్యార్థులకు ఉద్యోగాలు

● అభినందించిన డైరెక్టర్ రవికుమార్



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు, నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని శ్రీహర్షిణి పీజీ కళాశాలలో ఆదివారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 97మంది ఎంపికైనట్లు డైరెక్టర్ జి.రవికుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కళాశాలలో టాటా కంపెనీ, ఏసీఈ అకాడమీ వారు నిర్వహించిన సెలక్షన్స్‌లో తమ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం జరిగే క్యాంపస్ సెలక్షన్స్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి పీజీ వరకు విద్యార్థులకు విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే శ్రీహర్షిణిలో ఉద్యోగ పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని అర్థమేటిక్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ ఉచితంగా నేర్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇన్‌చార్జి దిలీష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సాగర్ కాలువపై వంతెన

వాహనదారుల భయాందోళన

పట్టించుకోని అధికారులు



సాగర్ కాలువపై రక్షణ గోడలు లేని వంతెన

ఒంగోలు మండలంలోని కొప్పోలు-కరవదిరోడ్డులోని గుత్తికొండవారిపాలెం డంపింగ్ యార్డు సమీపంలో గల నాగార్జున సాగర్ కాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు వంతెనపై నుంచి కాలువలో పడి ఆసుపత్రిపాలవుతున్న సంఘటన తరచూ జరుగుతున్నాయి. కొత్తగా ఈ మార్గంలో ప్రయాణించే వారు హెచ్చరిక బోర్డులు సైతం లేకపోవడంతో ఇబ్బందిపడు తున్నారు. వంతెనకు ఉన్న రక్షణ గోడలు శిథిలావస్థకు చేరి పడిపోయాయి. అయితే మరలా నిర్మించేందుకు ఎవరూ పట్టించుకోలేదు. ఒంగోలు మండలంలోని కరవది, ఉలిచి, దేవరంపాడు, చేజర్ల, గుండాయపాలెం, పాతపాడు, బీవీపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలోనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాకుండా ఒంగోలు నుంచి ప్రతి రోజు డంపింగ్ మార్డుకు చెత్త తరలించే వాహనాలు తిరుగుతుంటాయి. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి సాగర్ కాలువపై వంతెనను పునర్నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు రూరల్, (ఆంధ్రజ్యోతి)

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు విద్య, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరు సంవత్సరాల బీటెక్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. నూజివీడు, ఆర్కేవ్యాలి, ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలు ఉన్నాయి. దరఖాస్తు రుసుముగా జనరల్ అభ్యర్థులు రూ.300, రిజర్వుడు వర్గాల వారు రూ.200, ఇతర రాష్ట్రాల విద్యార్థులు రూ.1000 చెల్లించాలి. విద్యార్థులు పదో తరగతిలో సాధించిన మార్కులు ఆధారంగా మెరిట్‌కమ్ రోస్టర్ విధానంలో విద్యార్థులను ప్రవేశాలకు ఎంపిక చేస్తారు. ఆయా సబ్జెక్టుల్లో సాధించిన మార్కులు కూడా ప్రాతిపదికన తీసుకుంటారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్ల కన్వీనర్ కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజుకు నేడు తుదిగడువు

ఒంగోలు విద్య, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు ఫీజు చెల్లింపు గడువు సోమవారంతో ముగుస్తోంది. ఈ అవకాశాన్ని ఫెయిలైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ విద్యా డైరెక్టర్ కృతికా శుక్లా కోరారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

మద్దిపాడు, మే 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం మండల నాయకులు కనపర్తి సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పొగాకు రైతులు గిట్టుబాటు ధరలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలం కేంద్రాల్లో నోబిడ్ పేరుతో బేళ్లను వెనక్కి పంపుతున్నారని, దీంతో రైతులకు ఆర్థికభారం పెరిగిపోతుందని పేర్కొన్నారు. పొగాకు కొనుగోలును వేగవంతం చేయకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఇందిరమ్మ కాలనీలో తాగునీటి ఇక్కట్లు

మద్దిపాడు, మే 4 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తోంది. కాలనీకి తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయిందంటూ స్థానికులు వాపోతున్నారు. ఇందిరమ్మ కాలనీ వచ్చే మంచినీటి పైపులైను అడుగడుగునా లీకులు ఉండంతో నీరు వృధాగా కాలువల్లో పోతున్నాయి. వేసవికాలంలో తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. దీంతో మినరల్‌వాటర్ కొనాల్సివస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కానీలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు(కల్చరల్), మే 4(ఆంధ్రజ్యోతి) : వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా భగీరథ మహర్షి జయంతి వేడుకను ఆదివారం జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని భగీరథ మహర్షి విగ్రహానికి సంఘ అధ్యక్షుడు జూటూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూలమాల వేసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగను భూమికి తీసుకువచ్చిన గొప్ప తపోధనుడు భగీరథ మహర్షి అన్నారు. సగర కులస్తులు పేదరికంలో ఉన్నారని, తమను బీసీ(డి) నుంచి బీసీ(ఏ) గ్రూప్‌కు మార్చాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధానకార్యదర్శి జలశ్రీ మురళీకృష్ణ, నగర అధ్యక్షులు రెడ్డి పరమేశ్వరరావు, వెంకట్ నారాయణ, పప్పు శ్రీనివాసులు, దండూరి వెంకటేశ్వర్లు, దండూరి శ్రీనివాసులు, దుంపల వెంకటేశ్వర్లు, కొండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జీవీఎస్ హైస్కూలు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1999-2000లో 10వ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు పాతికేళ్ళ తర్వాత తమ కుటుంబసభ్యులతో కలిసి ఉత్సాహంగా వేడుకలకు హాజరయ్యారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన వేడుకల్లో వారు చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, ఫ్యాన్సీ డ్రస్‌ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి, అనంతరం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను, అలాగే తమకు విద్యాబోధనలు నేర్పించిన నాగాచారీ, సాంబశివరావు, ఇతర సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కె.నాగరాజు, పి.అఖండ్‌కుమార్, సీహెచ్.రవి కుమార్, జి.శివ, సురేష్, స్వరాజ్యం, వరలక్ష్మి, వాణి పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి జాతర


ముండ్లమూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడక పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీఆంజనేయస్వామి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. కొన్ని శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయంలో ప్రతి ఏడాది జాతర నిర్వహిస్తుంటారు. భక్తులు భారీగా తరలివచ్చారు.



ఆరోగ్యం.. అరచేతిలోనే..!



నేడు హ్యాండ్ వాష్ దినోత్సవం



చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

గత ఐదేళ్లలో పాఠశాలల్లో కనిపించని కార్యక్రమం

ఒంగోలు, కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మన ఆరోగ్యం మన చేతిలోనే ఉందని వైద్యులు తరచూ చెబుతుంటారు. ప్రతి రోజూ, ప్రతి పని తర్వాత చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని వెల్లడిస్తున్నారు. ప్రధానంగా క్రిములు, బ్యాక్టీరియా, మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్తాయని, అందుకోసం హ్యాండ్ వాష్‌ను అలవాటుగా మార్చుకోవాలని ఆరోగ్య సంస్థ ఘంటాపథంగా చెబుతోంది. ఐదేళ్ల క్రితం కోవిడ్ వైరస్‌ను అరికట్టేందుకు మందుల కన్నా, ప్రధాన ఆయుధం, మందు, చేతులుశుభ్రపరుచుకోవడం ద్వారానే సాధ్యపడిందని వైద్యులు స్పష్టం చేశారు. కేవలం ఆహారంతోనే కాకుండా ఆరోగ్య సూత్రాలలో ప్రధానమైన చేతుల శుభ్రతతోనే మన ఆరోగ్యం మన చేతిలో ఉంటుందనేది నిజం.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరంభం...

పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు, అవగాహన కల్పించేందుకు 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రతి ఏడాది ఎస్ఎస్ఏ గ్రాంట్ కింద రూ.5వేలు నుంచి రూ.7వేల వరకు నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులతో సబ్బులు, టవల్స్, అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలి. విద్యార్థులకు అందుబాటులో ఉంచడంతోపాటు, భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులు కడుక్కుంటున్నారా ? లేదా అని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కార్యక్రమం ప్రచారం తప్ప పరిశుభ్రతపై పెద్దగా పట్టించుకున్న వారు కనిపించడం లేదు. దీంతో విద్యార్థులు ఉదయం నుంచి పుస్తకాల చేతపట్టి, నోట్సులు రాసి, ఇంకులైన చేతులతో, డ్రిల్ క్లాసులో చేతికంటిన మట్టితోనే అలాగే భోజనానికి కూర్చునే వారు.

చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలి

- ముందుగా అరచేతిని సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- తరువాత చేతుల వెనుక భాగం శుభ్రం చేయాలి
- అనంతరం వేళ్ల వెనుక మణికట్టు భాగంలో కడగాలి.
- ఆ తర్వాత దశలో చేతి వేళ్ల మధ్య బొటనవేలి మధ్య కడగాలి.
- చివరిగా చేతి వేళ్ల గోళ్లను శుభ్రం చేసుకున్న తర్వాతనే భోజనం చేయాలి.
- భోజనం చేసే ముందు, మల విసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత, దగ్గినపుడు, తుమ్మినప్పుడు చేతులు అడ్డుపెట్టుకోవడం ద్వారా క్రిములు చేతికి అంటుకునే ప్రమాదం ఉంది.

శింగరకొండలో జనార్దన్ దంపతుల పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నాగసత్యలత

అద్దంకి,మే4(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నాగసత్యలత దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్యుసూక్త పారాయణంలో దామచర్ల దంపతులు పాల్గొన్నారు. దామచర్ల దంపతులను ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు, పూజారులు ఘనంగా సత్కరించి, ఆశీర్వదించారు.

జీవనశక్తిని అందించడం.. మహోపకారం

- 11 జిల్లాలకు చెందిన 68 మంది దివ్యాంగులకు ఆసరా
- రూ.5 లక్షల విలువైన పాదాలు, క్యాలీపర్స్ అందజేత


కృత్రిమ కాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో నడవలేక దివ్యాంగులై ఔత్సాహికంగా ఉన్నవారికి కృత్రిమ కాళ్లు అందించి జీవనశక్తిని అందించడం మహోపకారమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం ఎస్ఆర్ఐ వాసవి అసోసియేషన్, సికింద్రాబాద్‌కు చెందిన కుసుమ, శ్రీనివాస్, కృష్ణకుమారి ఆర్థిక సహాయంతో చీరాల ఆవోపా మహిళా విభాగం, ఖమ్మం రోటరీ ట్రస్టు సంయుక్తంగా 60 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలు, 8 మంది పోలియోగ్రస్థులకు క్యాలీపర్స్‌ను అందజేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగిన పంపిణీ కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. 11 జిల్లాలకు చెందిన 68 మందికి రూ.5 లక్షలు విలువైన కాళ్లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, ఆవోపా చైర్మన్ వలివేటి మురళీకృష్ణ, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తికి గౌరవప్రతిష్టలు తీసుకురావాలి

- హైకోర్టు జడ్జి కె.మన్మథరావు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న జడ్జి మన్మథరావు తదితరులు

ఒంగోలు(రూరల్), మే4(ఆంధ్రజ్యోతి): సమాజంలో న్యాయవాద వృత్తికి గౌరవ ప్రతిష్టలు తీసుకురావాలని, అలాంటప్పుడే న్యాయవ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని హైకోర్టు జడ్జి డాక్టర్ కె.మన్మథరావు అన్నారు. ఆదివారం రాత్రి ఒంగోలులోని కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ మన్మథరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. సీనియర్ న్యాయవాదులును సన్మానించారు. అనంతరం మన్మథరావు మాట్లాడుతూ న్యాయవ్యవస్థకు బార్ అసోసియేషన్‌కు మంచి సంబంధాలు ఉండాలన్నారు. న్యాయవాదులు కేసులపై అవగాహన పెంచుకోవాలని, అలాంటప్పుడే మంచి తీర్పులు వస్తాయని చెప్పారు. తాను 31 సంవత్సరాలు పాటు న్యాయవాదిగా, మూడేళ్లుగా హైకోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగులో కూడా తీర్పులు ఇచ్చానని గుర్తు చేశారు. అనంతరం జిల్లా న్యాయాధికారి ఎ.భారతి మాట్లాడుతూ కొత్తగా వచ్చిన న్యాయవాదులు సీనియర్ న్యాయవాదుల దగ్గర శిక్షణ పొందాలన్నారు. అలాంటప్పుడే న్యాయవాద వృత్తిపై పట్టు వస్తుందని చెప్పారు. అనంతరం జస్టిస్ మన్మథరావును, జిల్లా న్యాయాధికారి భారతిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మోహన్‌దాస్, కార్యదర్శి వి.సురేంద్ర, నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, నూతన సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. పలు పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

వేధింపులు తాళలేక భర్తను హత్య చేసిన భార్య

సహజ మరణంగా చిత్రీకరించేందుకు యత్నం


వలి మృతదేహం

కంభం, మే 4 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక భర్తను భార్య హత్య చేసింది. ఆపై హత్యను సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించి పోలీసులకు పట్టుబడిన ఘటన కంభం పట్టణం కాపవీధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరసింహారావు కథనం ప్రకారం... కంభం కాపవీధిలో షేక్ వలి(45), భార్య రిజ్వాన ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. వలి పెయింటర్‌గా పనిచేస్తున్నారు. వలి ప్రతిరోజూ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈనేపథ్యంలో శనివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన వలికి, భార్య రిజ్వాన మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో మంచంపై పడుకుని ఉన్న వలి మెడకు టవల్ బిగించి ఊపిరాడకుండా హత్య చేసింది. అనంతరం సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. మద్యం అతిగా సేవించి గొంతు ఎండి చనిపోయాడని తెలిపింది. విషయం తెలుసుకున్న పోలీసులు రిజ్వానాను లోతుగా విచారించడంతో భర్త వేధింపులు తాళలేక తానే హత్య చేసినట్లు అంగీకరించింది. మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐ మల్లికార్జున ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొట్ట కూటి కోసం పొరుగు ఊళ్లకు...

కూలి పనులు చేసేందుకు బయల్దేరిన గిరిజనులు


పొరుగు జిల్లాలకు వలస పోతున్న గిరిజనులు

ఎర్రగొండపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : కూలి పనులు లేక పొట్ట చేత్తో పట్టుకొని పొరుగు జిల్లాలకు గిరిజనులు వలసబాట పడుతున్నారు. ఎర్రగొండపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో తిరుమలగిరి కాలనీ గిరిజన కుటుంబాలకు ఇక్కడ కూలి పనులు లేక ఉపాధి కరువై పొరుగు జిల్లాలకు వెళ్తున్నారు. తిరుమలగిరికాలనీలో 100కు పైగా చెంచు గిరిజన కుటుంబాలు ఉన్నాయి. చెంచు గిరిజన కుటుంబాలకు వ్యవసాయ భూములు లేకపోవడంతో కుటుంబం గడవాలంటే నిత్యం కూలి పనులకు వెళ్లాల్సిందే. గిరిజన కుటుంబాలకు ఉపాధి హామీ పథకంలో ద్వారా చాలినన్ని పనిదినాలు కల్పించడం లేదని దీంతో పొరుగు జిల్లాలకు పనుల కోసం వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పథకం ద్వారా అందరికీ సక్రమంగా పనులు కల్పించాలని కోరుతున్నారు. శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయం నుంచి గిరిజన కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించేందుకు ఐటీడీఏ ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి రోజు 10 నుంచి 15 కుటుంబాల వరకు ఇతర జిల్లాలకు పనుల కోసం వలసబాట పడుతున్నారు.



చీరాలలో ఆటోపై కూలిన హోర్డింగ్‌లు, 27వ వార్డులో వాలిపోయిన విద్యుత్ స్తంభం

చీరాలలో వడగండ్ల వర్షం

రెండుచోట్ల పిడుగులు పడి గొర్రెలకాపరులు మృతి

పలుచోట్ల కూలిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు

చీరాల, మే 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం సాయంత్రం సుమారు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. ఈక్రమంలో పరిధిలోని పలు రహదారులు, సైడు కాలువలు జలమయమయ్యాయి. విద్యుత్ స్తంభాలు సైతం కూలి సరఫరా గంటల తరబడి నిలిచింది. అలాగే పట్టణంలో పలు ప్రాంతాల్లో హోర్డింగులు ధ్వంసమయ్యాయి. ఇదిలా ఉంటే పట్టణంలోని గోదావరి బిర్యానీ పాయింట్ వద్ద సుమారు 20 నిముషాలపాటు వడగండ్లు వర్షం పడింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వర్షంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ శాఖసిబ్బంది మాత్రం విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేశారు.


చీరాలలో ఓ బిర్యానీ పాయింట్‌లో పడిన వడగండ్లు

పిడుగుపాటుకు గొర్రెలకాపరి మృతి


మృతి చెందిన నాగమల్లేశ్వరరావు

నాగులుప్పలపాడు, మే 4(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గొర్రెలకాపరి మృతి చెందిన సంఘటన ఈదుమూడిలో చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ఈదుమూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొండేపి నాగమల్లేశ్వరరావు(42) రోజులాగే ఆదివారం కూడా మేకలను తోలుకొని గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇన్‌చార్జ్ వీఆర్వో నల్లూరి శ్యాం, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, పదేళ్ల వయసు కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన నాగమల్లేశ్వరరావు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

చినగంజాంలోనూ...

చినగంజాం, మే 4(ఆంధ్రజ్యోతి) : గేదెలు, గొర్రెలను మేపుకొనే సమయంలో పిడుగు పడడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటన చినగంజాం ప్రాంతంలోని కొమ్మమూరు కాలువ సమీపంలోని ఎత్తిపోతుల పథకం వద్ద చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని రామకోటేశ్వరకాలనీకి చెందిన గడ్డం బ్రహ్మయ్య(47) తన గేదెలు, గొర్రెలను పొలాల్లో మేత మేపుకునేందుకు తోలుకొని వెళ్లాడు. కొమ్మమూరు కాలువ వద్ద ఉన్న చినగంజాం ఎత్తిపోతుల పథకం బావుల వద్ద బ్రహ్మయ్య గేదేలు మేపుతున్న సమయంలో మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షం పడి పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీఆర్వో సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. బ్రహ్మయ్యకు భార్య సుజాత, కుమారుడు బాలమణికంఠ, కుమార్తె లలిత ఉన్నారు.


మృతి చెందిన బ్రహ్మయ్య

గడ్డి మైదానాలే వన్యప్రాణులకు ఆహారం

పెద్ద దోర్నాల, మే 4 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతంలో గడ్డి మైదానాల పెంపకంతోనే వన్యప్రాణుల సంరక్షణ జరుగుతోందని గడ్డి మైదానాల పెంపకం నిపుణుడు జీడీ మురాత్కర్ చెప్పారు. మండలంలోని పులిచెరువు ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బందికి గడ్డి మైదానాల పెంపుదల, పరిరక్షణపై ఆదివారం గ్రాస్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ మురాత్కర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులు అధికంగా సంచరించే పలు కీలకమైన మైదానాలను గుర్తించి మే, జూన్‌లో ఎంపిక చేసిన గడ్డి విత్తనాలను చల్లుకోవాలని, వర్షాలకు అవి మొలకెత్తి శాఖాహార ప్రాణులకు ఆహారంగా మారతాయన్నారు. తద్వారా ఏడాది పొడవునా ఆహార కొరత లేకుండా జీవులు సంచరించడం వల్ల చిరుతలు, పెద్దపులులు తదితర జంతువుల సంతతి కూడా వృద్ధి చెందుతుందని చెప్పారు. నల్లమల పచ్చదనంతో ఉన్నప్పుడే వన్యప్రాణుల మనుగడ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కాపురం డీఎఫ్‌వో సదీప్ కృపాకర్, దోర్నాల సబ్ డీఎఫ్‌వో వేణు, మార్కాపురం, దోర్నాల, కొర్రప్రోలు, వీపీ సౌత్ జోన్ రేంజి అధికారులు వరప్రసాద్, జీవన్‌కుమార్, ప్రసన్నజ్యోతి,సుజాత, డీఆర్‌వో ప్రసాద రెడ్డి, నాగరాజు, శవశంకర్, సూల్, ఫిలిఫ్ పాల్గొన్నారు.







1.ఒంగోలులో నీట్ పరీక్షా కేంద్రానికి హాజరైన విద్యార్థులు
2. పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా
3.విద్యార్థిని తలను కూడా పరిశీలిస్తున్న ఎస్సై
4.క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు
5.పరీక్షకు ఆలస్యం కావడంతో స్కూటీపై విద్యార్థినిని తీసుకెళ్తున్న ఏఎస్సై

నీట్‌గా పరీక్ష

ఒంగోలులో ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరిగాయి. మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసులు భారీబందోబస్తును ఏర్పాటు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే లోపలికి అనుమతించారు. ఒక్కొక్క పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షించేందుకు ఒక తహసీల్దార్, ఒక ఎస్ఐని నియమించారు. ఒంగోలులోని ఐదు పరీక్షా కేంద్రాలను సూపర్‌వైజింగ్‌చేసేందుకు ఆర్డీవో లక్ష్మీప్రసన్నను నియమించారు. నీట్ పరీక్ష రాసేందుకు ఒక విద్యార్థిని పరీక్షకు కొద్దిసమయంముందు రావడంతో ఒక మహిళా ఏఎస్సై తన స్కూటీమీద తీసుకెళ్లి పరీక్షా కేంద్రం వద్ద వదిలిపెట్టారు. జిల్లా కలెక్టర్ అన్సారియా డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. మొత్తం 1473 మంది విద్యార్థులను కేటాయించగా 1428 మంది హాజరయ్యారు. 96.94శాతం మంది విద్యార్థులు నీట్ పరీక్షలకు హాజరయ్యారు.-ఒంగోలు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

మిర్చి, బొబ్బర రైతుల కన్నీరు

- ధరలు లేక దిగాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

పొదిలి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఈఏడాది పండించిన మిర్చి, బొబ్బర రైతులకు ఈఏడాది నష్టాలు తప్పడం లేదు. పంట పండిందనే ఆశ అమ్ముకునేటప్పుడు లేకపోవడంతో అన్నదాతలు కన్నీరు పెడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడంతో దిగుబడి పర్వాలేదనిపించింది. తీరా మార్కెట్‌కు వెళితే కోసిన కూలి కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 క్వింటాళ్ల మిరపకాయలు కోసి ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకెళితే మేలు రకం రూ.10వేలు కూడా ధర పలకడం లేదని వాపోతున్నారు. 10 క్వింటాళ్ల మిర్చి మార్కెట్‌లో అమ్మితే రూ.97వేలు వచ్చాయని కూలీలకు లక్షా 10వేల రూపాయలు ఖర్చయినట్లు రైతు తాళ్లూరి దావీదు తెలిపారు. వర్షాభావం వల్ల ముందు బాగునా, తర్వాత పంట సమయానికి వాతావరణ పరిస్థితులతో తెగుళ్లు ఎక్కువై పంట ముడుచుకుపోయిందని ఎన్ని మందులు పిచికారీ చేసినా మార్పు రాలేదన్నారు. మిర్చికి ధర లేదని లబోదిబోమంటున్నారు. మండలంలో మొత్తం 300 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా, తెగుళ్లు ఎక్కువ ఆశించాయని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. గతంలో ఎకరాకు రూ.70 వేలు ఖర్చయితే.. ఇపుపడు రూ.లక్షా20వేల వరకు వస్తుందని, రాబడి మాత్రం లక్ష రూపాయలు మించి రావడంలేదని రైతులు చెప్తున్నారు. పురుగు మందుల ఖర్చు ఎక్కవవుతోందన్నారు. ఈ ఏడాది ధరలు లేకపోవడంతో ఒక దశలో పిచికారీ నిలిపివేశామన్నారు. గతంలో 250 ఉన్న కూలి రేట్లు ఈసంవత్సరం రూ.600 పెరిగాయని మిర్చి ధర మాత్రం నెంబర్‌వన్ రకం రూ.7వేల నుంచి రూ.11500 మాత్రమే ధర లభిస్తుందన్నారు. తాలుకాయలు రూ.4వేలు మించడం లేదంటున్నారు. కాయలు కోసి కుప్ప పోసినప్పుడు సంతోషంగానే ఉంటుంది మార్కెట్‌కు వెళితేనే ఏడుపు వస్తుందంటున్నారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి రాక దిగాలు చెందుతూ ఏమిచేయాలో పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అదే విధంగా బొబ్బర పంటకూడా ఎకరాకు సుమారు ఆరు క్వింటాళ్ల దిగుబడి వచ్చినా, ధరలు పడిపోయాయంటున్నారు. పంటకోసే సమయంలో ఆరువేలకు కొనుగోలు చేసిన వ్యాపారులు నాలుగువేలకు కూడా వద్దని కొనుగోలు నిలిపివేశారని రైతులు చెప్తున్నారు. ధరలు రాక, అప్పులు తీర్చలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తాలుకాయలను బస్తాలకు నింపుతున్న రైతు


ధరలు లేక బొబ్బర్లు కాటా వేసి స్టాకు చేస్తున్న రైతులు

క్వింటా మేలు రకం రూ.10వేలు మించడం లేదు

క్వింటా మేలురకం మిర్చి మార్కెట్‌లో రూ.10వేలు మంచి ధర రావడం లేదు. అదే క్వింటా మార్కెట్‌కు తెచ్చేందుకు సుమారుగా రూ.12 నుంచి రూ.13వేలు ఖర్చు అయింది. నేను మూడు ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. రూ.4లక్షలకు పైగా ఖర్చు అయింది. రాబడి సగం కూడా లేదు. కోత కోయాలంటే భయం వేస్తుంది. కూలీల రేట్లు బాగా పెరిగాయి. కోస్తే అమ్మకం కంటే కూలీలకే ఎక్కువ ఖర్చవుతుంది.

- మల్లేష్, రైతు

ధరలు లేకపోవడంతో నష్టాలు



రేయింబవళ్లు కష్టించి మిర్చిని సాగుచేశాను. ఈఏడాది ఒక్కతేజ రకం మినహా ఏకరానికి రూ.10వేలు మించి రాలేదు. ఖర్చులు రెట్టింపయ్యాయి. గత ఏడాది రూ.20 నుంచి రూ.24వేల ధర పలికింది. ఈ ఏడాది నష్టాన్ని చవిచూశాం. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

- నాగేశ్వరరావు, రైతు

బొబ్బర్లు రూ.4వేలకు అడగడం లేదు

కోతలు మొదలుపెట్టినప్పుడు రూ.6500 కొనుగోలు చేశారు. తర్వాత రూ.4వేలకు మించికొనుగోలు చేయడం లేదు. వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో, అప్పులు తీర్చులేక ఇబ్బంది పడుతున్నాం.

- మాధవరావు, రైతు


సంచులను అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

వస్త్ర సంచుల అందజేత

గిద్దలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మానవత సేవా సంస్థ దాతల సహకారంతో సమకూర్చిన 700 వస్త్ర సంచులను ప్రజలకు పంపిణీ చేశారు. పట్టణంలోని పెద్దకూరగాయల మార్కెట్, కుమ్మరాంకట్ట సెంటర్, రైల్వేస్టేషన్, నరవ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, చిన్నకూరగాయల మార్కెట్ సెంటర్లలో ప్రజలకు సంచులను అందచేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ కవర్లను వాడకుండా సంచులను వాడాలని ఈసందర్భంగా ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మానవత సేవాసంస్థ ప్రతినిధులు పీవీ శివారెడ్డి, గంజి వీరయ్య, సూరె రామచంద్రుడు, మూర్తయ్య, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు పిచ్చయ్య, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

7న అమ్మవారి జన్మదిన వేడుకలు

గిద్దలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిశాలలో ఈనెల 7వ తేదీ బుధవారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా బుధవారం ఉదయం ఆర్యవైశ్య పతాక ఆవిష్కరణ, అనంతరం కన్యకలు, ముత్తైదువులు తెచ్చిన గంగాజలంతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, వివిధ సెంటర్ల నుంచి తీసుకొచ్చిన పంచామృతాలతో ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకం, కలశాలు తీసుకురావడం, సాయంత్రం సామూహిక కుంకుమపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

లెమన్ జ్యూస్ పంపిణీ

గిద్దలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : వాసవి జాగృతి సంస్థ ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు లెమన్ జ్యూస్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి జాగృతి అధ్యక్షుడు శివపురం హరికృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, వాసవి జాగృతి ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఆధార్ ప్రత్యేక క్యాంప్

బేస్తవారపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : నేటి ఉదయం నుంచి బేస్తవారపేట మండల పరిషత్ సమావేశం హాల్‌లో ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏవీ రంగనాయకులు తెలిపారు. పేర్లు, పుట్టిన తేదీ, చిరునామా తప్పులను సవరిస్తూ కొత్త ఆధార్ కార్డుల కోసం కేంద్రంలో నమోదు చేయించుకోవచ్చునని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా వీబీఎస్ ఆదివారం


గీతాలను ఆలపిస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఎస్‌నగర్‌లోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో వీబీఎస్ ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. వేసవి కాల విరామ బైబిల్ పాఠశాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ పులకూరి అమృత్ తేజ్ మాట్లాడుతూ.. చిన్నపిల్లలు దేవుని యందు భయభక్తులు కలిగి ఉండాలని, ఆటలకు తరచుగా నా వద్దకు రావాలని వ్యాఖ్యం చెప్పారు.అనంతరం వివిధ ప్రార్థన గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వీబీఎస్ డైరెక్టర్ సుస్మిత, సూపరింటెండెంట్ గంగాభవాని, టీచర్లు హర్షిత, సౌమ్య, లావణ్య, ప్రమీలా, మాధురి, స్రవంతి పాల్గొన్నారు.

చిన్నకండ్లేరు కోసం పోస్టుకార్డు ఉద్యమం

పుల్లలచెరువు, మే 4 (ఆంధ్రజ్యోతి) : తీగలేరు 5 కాలువలను పుల్లలచెరువు చిన్న కండ్లేరుకు అనుసంధానం చేసే పనులను వెంటనే శంకుస్థాపన చేయాలని రైతులు కోరారు. ఆదివారం మండలంలోని పాత చెరువు తాండాలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులపై రాసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీవీ గురునాథం, రైతు సంఘం నాయకులు జానకీ రఘు, కోటిరెడ్డి, లింగంగుంట్ల రాములు, నాగేశ్వరరావు నాయక్, శ్రీను నాయక్, రైతులు పాల్గొన్నారు.

కారు - పాల వ్యాన్ ఢీ.. నలుగురికి గాయాలు

మార్కాపురం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగుంట్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కారు పాల వ్యాన్ ఎదురెదురు పడి ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళుతున్నారు. పాలవ్యాన్ మార్కాపురం నుంచి కంభంకు వెళ్తున్నది. మా ర్కాపురం మండలం చింతగుంట్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారి వద్ద కారును ఎదురుగా వస్తున్న పాలవ్యాను ఢీకొట్టింది. కారులో ఉన్న శివశంకర్, అరుణ, రాజేశ్వరి, ఫణీంద్ర గాయపడ్డారు. క్షతగా త్రులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఒంగోలు కిమ్స్‌కు వెళ్లా రు. రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణకిషోర్‌రెడ్డి

అభివృద్ధి పనులు ప్రజలకు తెలియాలి

టీడీపీ నేత కృష్ణకిషోర్‌రెడ్డి

కొమరోలు, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలకు తెలియజేసే బాధ్యత కార్యకర్తలపై ఉందని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి అన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి గృహంలో ఆదివారం నిర్వహించిన కొమరోలు గ్రామపంచాయతీ పరిధిలోని టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకముందు స్థానిక వినాయకస్వామి ఆలయ సెంటర్‌లో ప్రనజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా ప్రభుత్వం చేస్తున్న, చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందాలన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి లక్ష్యాన్ని ఐక్యతతో సాధించాలన్నారు. చర్చివద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన విషయాన్ని తెలుసుకున్న కృష్ణకిషోర్ వెంటనే ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. గోపానిపల్లి, హనుమంతురాయునిపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకురాగా, విషయాన్ని ఎమ్మెల్యేకి చెప్పి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ సర్పంచ్ షేక్ అద్దుల్ ఖారద్, మాజీ సైనికుల సంఘం మండల అధ్యక్షుడు అంబవరపు రామకృష్ణారెడ్డి, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు నబి, నాయకులు చలిచీమల శ్రీనివాస చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చదవడంతోపాటు డ్రాయింగ్‌పై శిక్షణ


బీపేటలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు

బేస్తవారపేట, మే (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణలో కథలు, పుస్తకాలు చదివించడం, డ్రాయింగ్ తదితర అంశాలను నేర్పించారు. ఆదివారం 17 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు.

పెద్దదోర్నాల : గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఆదివారం కొనసాగాయి. గ్రంథపాలకుడు వెంకట సుబ్బారెడ్డి, ఫ్యాకల్టీ శ్రీనివాసరావు విద్యార్థులకు డ్యాన్స్, ఇంగ్లీష్‌లో చదవడం, రాయడం, కుర్చీలాటను నేర్పించారు.

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

మార్కాపురం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు తెలిపారు. మండలంలోని మొద్దులపల్లి, నాయుడుపల్లి, మన్నెంవారిపల్లిలో పార్టీ నాయకులతో ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలను ఏర్పాటుచేసి బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్, ఎంపీటీసీ పదవులకు పోటీలో నిలబడేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ గుమ్మ రాఘవేంద్ర, మండల ఇన్‌చార్జి చాతరాజు పల్లి ప్రవీణ్, నాయకులు గాయం వెంకటేశ్వరరెడ్డి, రఘురాం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విప్రోకు ఎంపికైన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సాధన కళాశాలలో బహుళజాతి సాఫ్ట్‌వేర్ సంస్థలు విప్రో, టీసీఎస్‌లకు తమ కళాశాలలో చదివిన కె.అజయ్‌కుమార్, కె.త్రిష ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డా.కప్పగంతుల మధుసూదన్ ఆదివారం తెలిపారు. 2020-23 విద్యా సంవత్సరంలో కందగట్ల అజయ్ బీఎస్సీ పూర్తి చేశారని, 2021-24లో కఠారి త్రిష బీఎస్సీ పూర్తి చేశారన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ విభాగం ద్వారా వివిధ నైపుణ్యాల కోర్సులలో శిక్షణ పొందిన విద్యార్థులను ఈ రెండు సంస్థలు నిర్వహించిన ఆన్‌లైన్ రాత, మౌఖిక పరీక్షలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఉత్తర్వులు పంపారని తెలిపారు. వీరిని బిట్స్, శాస్త్ర, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ద్వారా పీజీ చదువేందుకు కంపెనీలు ఖర్చులు భరిస్తాయని, అనంతరం కొ లువులకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.


త్రిష


అజయ్‌కుమార్

ఉచిత శిక్షణతో ఉపయోగం

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శాప్, కోడి రామ్మూర్తి ఆరోగ్య క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో వేసవి క్రీడా, నట శిక్షణ శిబిరం ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..శిక్షణ శిబిరాలు ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని, చదువుతోపాటు ఆటలు ఎంతో ముఖ్యం అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో అశోక్‌రెడ్డి, డాక్టర్ టి.సంజీవ్, రాష్ట్ర బాక్సింగ్ కోచ్ పి.వేణు, కోడి రామ్మూర్తి ఆరోగ్య క్రీడా సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిన్నిక నాగేశ్వరరావు, కార్యదర్శి కాళంగి శ్రీనివాసులు, ఫుట్‌బాల్ కోచ్ ఉప్పు రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.


వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల


వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా శిలా ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఎర్రగొండపాలెం రూరల్ మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లారెడ్డి పల్లి గ్రామంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శ్రీ గోవిందమాంబ సిద్ధయ్య శిలా ధ్వజ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ బృందం ఆధ్వర్యంలో మూడు రోజులుగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనాచార్యులు బ్రహ్మశ్రీ గోవిందస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలంలో ఆదివారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో వెలసిన సత్యమ్మ దేవి అమ్మవారి దేవాలయంలో ఆదివారం తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల వారు ఎడ్ల బండ్లను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ శివారులలో వెలసి ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.


భగీరథుని విగ్రహానికి పూజలు చేస్తున్న జనసేన ఇన్‌చార్జి కాశీనాథ్

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

మార్కాపురం వన్‌టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : రాజశ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు సగర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మార్కాపురంలో నిర్వహించారు. తర్లుపాడు రోడ్డులోని భగీరథ మహర్షి విగ్రహానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి ఇమ్మడి కాశీనాథ్ పూజలు చేశారు. కార్యక్రమంలో సగర సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, అధ్యక్షుడు కొప్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భగీరథ మహర్షి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సగర సంఘ కార్యదర్శి ఎం.వీరాంజనేయులు, కోశాధికారి ఎం.వెంకటేశ్వర్లు, నాయకులు బాల శంకరయ్య, రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న విశ్రాంత హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అవసరమైన సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఏరువా సత్యనారాయణరెడ్డి అన్నారు. ఎస్‌వీకేపీ కళాశాల మైదానంలో రాయల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి క్రీడా శిక్షణను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాహమతుల్లా, కార్యదర్శి రామకృష్ణ, దీక్షా యూత్ అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తేవాలి

జిల్లా పంచాయతీరాజ్ అధికారి వెంకటనాయుడు

పుల్లలచెరువు, మే 4 (ఆంధ్రజ్యోతి) : చెత్త సంపద తయారీ కేంద్రాలను 10 రోజుల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి జీ వెంకటనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని కొమరోలులో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వానపాముల తయారీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కొమరోలు సంపద తయారీ కేంద్రం పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లాప్ మిత్రలకు జీతాలు ఇవ్వడంలేదని ఆయన దృష్టికి రాగా, పంచాయతీ జనరల్ ఫండ్స్ నుంచి 30 శాతం జీతాలకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో వైపాలెం ఈవోఆర్డీ రాజశేఖరరెడ్డి, కార్యదర్శి, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.


కొమరోలులోని చెత్త సంపద కేంద్రంలో వానపాములను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీరాజ్ అధికారి వెంకటనాయుడు

కంటి వైద్య శిబిరానికి స్పందన

పొదిలి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఆలూరి కంటి హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఒంగోలు రాయల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 250 మందికి పరీక్షలు చేసినట్లు వైద్యురాలు నాగసుధ తెలిపారు. వారిలో 110 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని చెప్పారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. రాయల్ కంటి వైద్యశాల లో ఉచితంగా ఆపరేషన్‌లు చేసి అనంతరం ఇంటిదగ్గరకు తీసుకువస్తామన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లి పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. పలువురు వాహనదారులు వాహన పూజలు చేయించగా, మరి కొందరు భక్తులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు కుంకుమ పూజలు చేశారు. వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో భక్తులతో గుంటిగంగ ప్రాంగణం సందడిగా మారింది. ఆలయ అర్చకపూజారి ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పీ ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు, మే 4(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు, శివరాంపురం, మాధవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం 3 ఫేజ్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గుళ్లాపల్లి నుంచి విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తున్నందున ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు త్రీ ఫేజ్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. సింగిల్ ఫేజ్ సరఫరా మాత్రమే ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెలుగు మహిళా నేత మృతి బాధాకరం

దర్శి, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం గ్రామానికి చెందిన తెలుగు మహిళ నాయకురాలు గాజుల కోటమ్మ మృతి బాధాకరమని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. ఇటీవల ఆమె గుండెపోటుతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న డాక్టర్ లలిత్‌సాగర్, టీడీపీ నాయకులు గ్రామానికి వెళ్లి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అలాగే, మోకాళ్ల ఆపరేషన్‌లు చేయించుకున్న టీడీపీ కార్యకర్తలు అటికల శ్రీనివాసరావు, పోకూరి అంకమ్మ, వెంకటరెడ్డిలను కూడా పరామర్శించారు. ఆయన వెంట నాయకులు దారం సుబ్బారావు, మారెళ్ల వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు చిన్నా, అంకయ్య, తదితరులు ఉన్నారు.

వృద్ధుల ఆశ్రమానికి వితరణ

దర్శి, మే 4(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణానికి చెందిన పెరుమాళ్ల సాయిగౌతమ్ కుటుంబసభ్యులు స్థానిక షిర్డి సాయిబాబా వృద్ధుల ఆశ్రమానికి ఆదివారం వంద కేజీల బియ్యం, పది కేజీల కందిపప్పు, సరుకులు అందజేశారు. సాయి గౌతమ్ కుమారులు శ్రీనివాసరావు, యశ్వంత్‌కుమార్‌లు ఆశ్రమానికి తనవంతు సహకారం అందించారు.

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు 20లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు విద్య, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరు సంవత్సరాల బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. నూజివీడు, ఆర్కేవ్యాలి, ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలు ఉన్నాయి. దరఖాస్తు రుసుముగా జనరల్ అభ్యర్థులు రూ.300, రిజర్వుడు వర్గాల వారు రూ.200, ఇతర రాష్ట్రాల విద్యార్థులు రూ.1000 చెల్లించాలి.

విద్యార్థులు పదో తరగతిలో సాధించిన మార్కులు ఆధారంగా మెరిట్‌కమ్ రోస్టర్ విధానంలో విద్యార్థులను ప్రవేశాలకు ఎంపిక చేస్తారు. ఆయా సబ్జెక్టుల్లో సాధించిన మార్కులు కూడా ప్రాతిపదికన తీసుకుంటారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్ల కన్వీనర్ కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజుకు నేడు తుదిగడువు

ఒంగోలు విద్య, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు ఫీజు చెల్లింపు గడువు సోమవారంతో ముగుస్తోంది. ఈ అవకాశాన్ని ఫెయిలైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ విద్యా డైరెక్టర్ కృతికా శుక్లా కోరారు.

'గోకులం' బిల్లుల కోసం ఎదురుచూపులు

- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

పామూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈపథకాన్ని అమలుచేశారు. ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని పునఃప్రారంభించింది. వంద శాతం ఉపాధి హామీ నిధులతో గోకులం షెడ్లు నిర్మించారు. పామూరు మండలంలో 25 గ్రామ పంచాయతీలకుగాను 26, సీఎస్‌పురం 23 గ్రామ పంచాయతీలకుగాను 25 గోకులం షెడ్లు మంజూరుచేశారు. ఇందులో గేదెల షెడ్లు అధికంగా ఉన్నాయి.

పామూరు, సీఎస్‌పురం మండలాలకు మంజూరైన గోకులం షెడ్ల యూనిట్‌లను సంబంధిత అధికారులు గ్రౌండింగ్ చేసి లబ్ధిదారులతో నాణ్యతగా నిర్మింపచేశారు. ఆరు గేదెలు ఉండే గోకులం షెడ్డుకు ప్రభుత్వం రూ.2,20 లక్షలు మంజూరు చేసింది. వీటి కోసం గ్రామాల్లో లబ్ధిదారులు పోటీపడి దక్కించుకొన్నారు. అయితే, షెడ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ నేటికి బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. షెడ్లు నిర్మించి నెలలు గడుస్తున్నా ఉపాధి అధికారులు అవిగో, ఇవిగో వస్తున్నాయి అంటు కాలం వెళ్లదీస్తున్నారే తప్ప బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావడంలేదు. దీంతో లబ్ధిదారులు ఉపాధి కార్యాలయాల చుట్టూ బిల్లుల కోసం తిరుగుతున్నారు.



పామూరు మండలం కోడిగుడ్లపాడులో నిర్మించిన గోకులం షెడ్



సీఎస్‌పురం మండలం బోయమడుగులలో నిర్మించిన షెడ్

అంధకారంలో పోలవరం

- మూడు రోజులుగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ముండ్లమూరు సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్థుల రాస్తారోకో

ముండ్లమూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామానికి మూడు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో గ్రామస్థులు ఆదివారం ముండ్లమూరులోని సబ్‌స్టేషన్ ఎదురుగా అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై గంటపాటు రాస్తారోకో చేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయి మూడు రోజులు కావస్తుంటే కనీసం విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. వేసవి కాలం కావటంతో ప్రజలతో పాటు మూగ జీవాలు దాహార్తితో అలమటించి పోతున్నాయి. ఉక్కపోతతో వృద్ధులు, చిన్నపిల్లలు అల్లాడిపోతున్నారు.

దీంతో గత్యంతరంలేక గ్రామస్థులు రాస్తారోకో చేయడంతో అద్దంకి - దర్శి రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఎస్‌ఐ కె.కమలాకర్ విషయం తెలుసుకొని ఏఎస్‌ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బందిని రాస్తారోకో వద్దకు పంపి మాట్లాడారు. విద్యుత్ ఏఈగాని, ఉన్నతాధికారులు గాని వచ్చి హామి ఇచ్చేంత వరకు రాస్తారోకో విరమించబోమని తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెంటనే రాస్తారోకోను విరమించాలని, వెంటనే గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు తెలపాలని టీడీపీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావును పంపించారు. దీంతో రాస్తారోకోను విరమించారు.

కార్యక్రమంలో కిలారి అంజయ్య, కొర్రపాటి శ్రీనివాసరావు, బుచ్చిబాబు, నరసింహారెడ్డి, కిలారి సుమాన్, మాలెంపాటి మంగయ్య, మదు, రావెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు సబ్ స్టేషన్ వద్ద రాస్తారోకో చేస్తున్న పోలవరం గ్రామస్థులు

విద్యుత్ పునరుద్ధరణ

మండలంలోని పోలవరంలో ఆదివారం సాయంత్రం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏఈ టి.చిన అంకబాబు తన సిబ్బందితో వెళ్ళి విద్యుత్ లైన్‌లను పరిశీలించారు. త్రీఫేజ్ విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైట్‌బర్లీ రైతుల కష్టాలు

- వేలం కేంద్రాల్లో అరకొరగా కొనుగోలు
- అధిక సంఖ్యలో వెనక్కిపంపుతున్న వైనం
- ఇళ్ల వద్దే మగ్గుతున్న పొగాకు బేళ్లు

ముండ్లమూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది వైటబర్లీ పొగాకు సాగుచేసిన రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటను అమ్ముకోవడం గగనంగా మారింది. రోజుల తరబడి వేలం కేంద్రాల వద్ద పడిగాపులు కాచినా కొనుగోలు చేయకపోవడంతో పొగాకు చెక్కులను తిరిగి తెచ్చుకుంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు ఐటీసీ, జీపీఐ కంపెనీలు వారు ఇచ్చిన విత్తనాలతో పొగాకు సాగుచేశారు. రెండు నెలల నుంచి పొగాకు అమ్మకాలు చేస్తున్నారు. మొదట్లో నెల రోజులపాటు జీపీఐ, ఐటీసీ సంస్థలు కొనుగోలు చేశారు. ఆతరువాత నుంచి రైతులకు కష్టాలు తప్పటం లేదు.

మండలంలో 2560 ఎకరాల్లో వైట్‌బర్లీ సాగు చేశారు. కొందరు నల్లబర్లీ కూడా సాగు చేశారు. వైట్ బర్లి ఎకరానికి సరాసరి ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధర ఆశాజనకంగా ఉన్నా కూడా కొనుగోలు చేసేవారేలేరు. కొందరు వేలం కేంద్రాలకు తీసుకెళ్లి వారం పాటు అక్కడే ఉంటున్నా ఒకటి రెండు చెక్కులు కొని మిగతావి వెనక్కి పంపుతున్నారు. కొందరికైతే గేటు పాసులు కూడా ఇవ్వడంలేదు. దీంతో మండలంలోని అనేక గ్రామాలకు చెందిన రైతులు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలోనని ఆందోళన చెందుతున్నారు.

మండలంలో నాయుడుపాలెం, తమ్మలూరు, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, పసుపుగల్లు, పోలవరం, శంకరాపురం, మారెళ్ళ, జమ్మలమడక, మక్కెనవారిపాలెం, చింతలపూడి, కమ్మవారిపాలెం, వేముల, ఈదర, బొప్పూడివారిపాలెం, సింగనపాలెం, సుంకర వారిపాలెం, నూజెండ్లపల్లి గ్రామాల్లో వైట్‌బర్లీ సాగు చేశారు. వైట్‌బర్లీని కొనుగోలుచేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పసుపుగల్లులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకు బేళ్లు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని తాళ్ళూరు గ్రామంలో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు.

ఈసం దర్బంగా మాట్లాడుతూ రైతులు సులభంగా తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్ళి విక్రయించుకోవచ్చునని చెప్పారు. దీనివల్ల రైతులకు రవాణా ఖర్చు తగ్గడంతోపాటు పంటను త్వరగా అమ్ముకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈసందర్భంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈక్రాప్‌లో వచ్చే సమస్యలతో పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నిబంధనలను సడలించి పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసేవిధంగా కృషి చేయాలని డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని కోరారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వెంట బాలు ఓబులురెడ్డి, సుబ్రమణ్యం, తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రంలోని కందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

అధికారుల ముమ్మర తనిఖీలు

- ఓవర్‌లోడ్‌తో వెళుతున్న వాహనాలకు జరిమానాలు
- ఆటో డ్రైవర్‌లకు కౌన్సెలింగ్
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు

దర్శి, మే 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా, ఆర్టీసీ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా దర్శి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆర్టీసీ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తూ ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోలు, ఇతర వాహనాలను పట్టుకొని జరిమానాలు విధిస్తున్నారు. ఇటీవల పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవటం, అనేకమంది గాయాల పాలవ్వటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు.

ముండ్లమూరు మండలం, ఉల్లగల్లు వద్దం ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న కూలీల ఆటో బోల్తాపడి మహిళ మృతిచెందటంతో పాటు పదిమంది గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, దర్శి, కురిచేడు, దొనకొండ మండలాల్లో కూడా రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందటంతో పాటు అనేకమంది గాయపడ్డారు. ఈనేపథ్యంలో అధికారులు అన్నీ ప్రధాన రహదారుల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడ్ వెళ్తున్న ఆటోలు, ఇతర వాహనాలకు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. ప్రధానంగా ఆటోల్లో పరిమితకి మించి ప్రయాణికులను ఎక్కించుకొని అతివేగంగా వెళ్లటం వలన ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో అధికారులు ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

భవిష్యత్తులో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు కూడా చైతన్యవంతులు కావాలని, ఎక్కువమంది ఎక్కటం వల్ల ఆటోలు కంట్రోల్ తప్పి ప్రమాదాల బారిన పడుతున్న విషయాన్ని గుర్తించాలని అధికారులు కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరుతున్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక

తాళ్లూరు, మే 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశానుసారం గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ పరిశీలకులు గుమ్మడి సాయి, మండల పార్టీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీను ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గ్రామాల్లో పర్యటించి పది గ్రామాల్లో కమిటీలను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. బొద్దికూరపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పోలంరెడ్డి సుబ్బారెడ్డి(బట్టీ సుబ్బారెడ్డి), రామభద్రాపురం అధ్యక్షుడిగా షేక్ చినహుస్సేన్, దోసకాయలపాడు అధ్యక్షుడిగా నరిశెట్టి వెంకట్రావు, తాళ్లూరు అధ్యక్షుడిగా మారం వెంకటరెడ్డి, లక్కవరం గ్రామ అధ్యక్షుడిగా బొడ్డు హనుమారెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే, వెలుగువారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా గుజ్జుల అంకిరెడ్డి, కొర్రపాటివారిపాలెం అధ్యక్షుడిగా కొమ్మినేని లక్ష్మీనారాయణ, శివరాంపురం అధ్యక్షుడిగా వద్దినేని శ్రీను, రజానగరం అధ్యక్షుడిగా షేక్ ఖాసీంసైదా, తురకపాలెం గ్రామ అధ్యక్షుడిగా కుమ్మిత సుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆయా గ్రామాల టీడీపీ శ్రేణులతో సంప్రదించి అందరి ఆమోదంతో గ్రామ కమిటీలను ఎంపిక చేస్తున్నారు.

బెల్ట్ షాపుపై కేసు నమోదు

దొనకొండ, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్దిపాడు గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈసందర్భంగా అక్రమంగా విక్రయాలు చేస్తున్న వ్యక్తి నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల్లో అక్కడక్కడ అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుతుందన్నారు. బెల్ట్‌షాపులపై ప్రతిరోజు దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల 76 బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేసి సుమారు 860 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులను పట్టుకొని 18 కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహించినా, మద్యం అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ వీఆర్ సత్యనారాయణరావు, సిబ్బంది ఖాసింపీరా, నాగరాజు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి జాతర



ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ముండ్లమూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడక పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీఆంజనేయ స్వామి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈసందర్భంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు.

కొన్ని వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రతిఏడాది జాతర నిర్వహిస్తుంటారు. జమ్మలమడక, కొండలరాయునిపాలెం, మక్కెనవారిపాలెంతో పాటు బల్లికురవ మండలం వెలమవారిపాలెం, మైలవరం గ్రామానికి చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. జమ్మలమడక గ్రామం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మైలవరం గ్రామస్థులు విద్యుత్ ప్రభను ఏర్పాటుచేశారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు



స్వామివార్లకు నైవేద్యం తెస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు), మే 4 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థాన అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన గాలి గోపురం వద్ద నుంచి మేళతాళాలతో స్వామి వారికి మహా నైవేద్యాన్ని ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదిక్షణలు చేసి సమర్పించారు. గోశాలలో ఉన్న గోవులకు పసుపు కుంకుమతో పూజలు నిర్వహించారు. తదనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మైదాన గిరిజనులకు అన్నిరంగాల్లో ప్రాధాన్యమివ్వాలి

ఒంగోలు కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజనులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు కోరారు. ఆదివారం ఒంగోలులో జరిగిన మైదాన గిరిజన సదస్సుకు హాజరైన వారు మాట్లాడుతూ ఎరుకుల, యానాదులు, చెంచులు, కమ్మర్లు, సుగాలీలకు రాజకీయాలలో ప్రాధాన్యత ఇచ్చి అసెంబ్లీలలో టికెట్‌లు ఇవ్వాలన్నారు. వారికి అవకాశం కల్పించినపుడే మైదాన గిరిజనుల సమస్యల పరిష్కారం అవుతాయని చెప్పారు. జగన్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రకారం రాష్ట్రంలో మొత్తం జనాభా 4.32 కోట్లు ఉంటే అందులో ఎస్టీలు 25,34,795 మంది ఉన్నారని, అందువల్ల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలో మైదాన ప్రాంత గిరిజన ప్రాంతాలలో ఎస్టీలకు నియోజకవర్గాల ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రతి ఏటా గిరిజననుల సంక్షేమ బడ్జెట్ ప్రకటిస్తున్న వాస్తవంలో కార్యరూపం దాల్చడం లేదని విమర్శించారు. చట్టసభల్లో గిరిజనులకు అవకాశం కల్పించాలని, ఉపాధి, అభివృద్ధి, సంక్షేమ ప్రత్యేక పథకాలు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త, బక్కా పరంజ్యోతి, రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన మైదాన సంఘం జిల్లా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరవ రోజుకు చేరిన సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ పరిధిలో గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల గత నెల జీతం నిలుపుదల చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్రీకాంత్, జిల్లా సెక్రటరీ ప్రసన్న, జీవన్‌జ్యోతి, రామాంజనేయులు, కామేష్ పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా) 5-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	27
నరసరావుపేట	39	28
బాపట్ల	37	27
రెంటచింతల	41	27
చీరాల	37	27

ముద్ర.. మోసం

రుణాల పేరుతో ఆన్‌లైన్‌లో టోకరా



ఆధార్ కార్డు, పాన్ కార్డు ఉంటే చాలు.. ఎటువంటి ష్యూరిటీ అవసరం లేదు.. రూ.5 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ముద్ర రుణమిస్తాం.. కేవలం ఐదు నిమిషాల్లోనే ఖాతాలో నగదు జమ వుతుంది.. అంటూ ముద్ర రుణాల పేరుతో నయా మోసాలు వెలుగు చూస్తున్నాయి. ఇది సాదాసీదా పథకం కాదని.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ముద్ర రుణ పథకం అంటూ మోసగాళ్లు వల వేసి దోపిడీ చేస్తున్నారు. ఇది కాదంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రుణ పథకం ద్వారా కూడా రుణం మంజూరుచేస్తామంటూ ఆన్‌లైన్ వేదికగా మాయ చేస్తున్నారు. పైగా ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోలు, రాజముద్రలతో ప్రకటనలు, లింకులతో వల వేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనల్లాగే ఉండటం, ప్రధాని, ముఖ్యమంత్రి ఫొటోలు, రాజముద్రలను చూసి పలువురు వారి మాయలో పడి మోసపోతున్నారు. సులభంగా రుణాలు వస్తున్నాయని నమ్మిన వ్యక్తుల ఆధార్, బ్యాంక్ ఖాతాల వివరాలు పెట్టించుకునే మోసగాళ్లు దర్జాగా దోచేస్తున్నారు.

- సీఎం రుణ పథకమని మాయ చేస్తూ దోపిడీ
- ష్యూరిటీ లేకుండా ఐదు నిమిషాల్లో మంజూరని వల
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఫొటోలతో ప్రకటనలు
- రూ.25 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఇస్తామంటూ ఎర

తెనాలి, మే 4 (ఆంధ్రజ్యోతి): తెనాలి మండలం కొలకలూరు, బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు ప్రాంతాల్లో పలువురు రుణాల మాయలో పడి మోసపోయి రూ.లక్షల్లో పోగొట్టుకున్నారు. ఇలా బయటపడిన వారు కొందరే. బయటకు చెప్పుకోలేక కొందరు, అవమానంతో కొందరు.. ఉద్యోగులవడంతో రచ్చ చేసుకోవడం ఎందుకులే అని సరిపెట్టుకుంటున్నారు. తెనాలి తహసీల్దారుకే ఈ తరహా బెదిరింపు కాల్ రావడం... పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి చర్యలు లేవు. సామాన్యులకి జరుగుతున్న మోసాలు, నష్టాల పరిస్థితి ఇక చెప్పనవసరంలేదు. ముద్ర రుణం అంటే కేంద్ర ప్రభుత్వం అందించే రుణ పథకం. కొన్ని ప్రైవేటు రుణ సంస్థలు అదే పేరుతో ఆన్‌లైన్‌లో మోసపు ప్రకటనలు ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పథకం కావడం.. ప్రధాని ఫొటో, రాజముద్ర లోగో, ఆధార్, పాన్ కార్డు ఉంటే చాలని, ష్యూరిటీ అవసరం లేదన్న ప్రకటనలు చూసిన పలువురు వారి మాయలో పడుతున్నారు. బ్యాంకులకు వెళ్లకుండా, ఎటువంటి పత్రాలతో పనిలేకుండా రుణం వస్తుందన్న ఆశతో ఉన్న వారికి ఆ ప్రకటన కిందే ఉన్న లింక్‌ను క్లిక్ చేసి వివరాలు ఇస్తున్నారు. రుణం మంజూరైంది.. నగదు ఖాతాలో జమ కావాలంటే ప్రాసెసింగ్ చార్జీలు చెల్లించాలనే లింక్ వస్తుంది. రూ.500 నుంచి రూ.10 వేల వరకు చెల్లించాలని ఆ లింక్‌లో రావడం గమనార్హం. ఆ తర్వాత రుణానికి బీమా ప్రీమియం కింద రూ.12,500 చెల్లించాలని కొందరికి, రూ.35 వేలు చెల్లించాలని మరికొందరికి లింక్‌లో చూపుతున్నారు. రూ.10 లక్షల రుణానికి రూ.2,500 చెల్లించాలని, రూ.5 లక్షల రుణానికి రూ.9,435 చెల్లించాలని దరఖాస్తుదారులకు లింకులు వస్తున్నాయి. అయితే ముద్ర రుణం కోసం ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయకూడదనేది కేంద్రం సూచించిన నిబంధన కాగా అందుకు విరుద్ధంగా ఆన్‌లైన సంస్థలు వసూలు చేస్తున్నాయి. ముద్ర రుణ పరిమితి ప్రస్తుతం రూ.20 లక్షలే. అయితే బూటకపు రుణ సంస్థలు మాత్రం ఏకంగా రూ.75 లక్షల వరకు రుణాలు ఇచ్చేస్తామని ప్రకటనలు చేయడం గమనార్హం. ముద్ర రుణం అని ప్రకటిస్తూ దానిలో వ్యక్తిగత, వ్యాపార, ఆస్థి, కారు, గృహ, రైతు, తాకట్టు రుణాలు అంటూ ప్రకటన చేస్తున్నారు. పైగా మహిళలు, విద్యార్థులు, ఉగ్యోగులకు ప్రత్యేక రాయితీ అంటూ వల వేస్తున్నారు.



కేంద్ర ప్రభుత్వ అధికారిక ప్రకటన

ముద్ర రుణంలో తరుణ్ కేటగిరీలో అత్యధికంగా రూ.10 లక్షల వరకే రుణం మంజూరవుతుంది. కానీ ఇక్కడ ఏకంగా రూ.60 లక్షలకు పైగా మంజూరైనట్లు మెసేజ్‌లు చేస్తున్నారు. పి.ఎం.ఎం.వై కింద అధికారికంగా రుణం మంజూరు చేసినట్లు చూపడం ఘరానా మోసానికి నిదర్శనం. వారు అడిగిన మొత్తాలన్నీ చెల్లించాక ఆన్‌లైన్‌లోనే రుణం మంజూరైనట్లు పేరు, అడ్రస్‌తో ఏకంగా ఒక మంజూరు ధ్రువీకరణ పత్రమే వచ్చేస్తుంది.

సీఎం రుణ పథకం అంటూ కొత్తగా..

సీఎం రుణ పథకం అంటూ మరికొన్ని సంస్థలు ఆన్‌లైన్ వేదికగా ప్రకటనలు గుప్పిస్తున్నాయి. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో, ప్రభుత్వ అధికారిక ముద్ర ఉండటం గమనార్హం. ఆధార్, పాన్ కార్డ్, బ్యాంక్ వివరాలు, ఫొటో ఉంటే ఐదు నిమిషాల్లో రూ. 2 లక్షల వరకు రుణం అంటూ ఆకర్షిస్తున్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్న వారికి ఆ ఫీజు, ఈ ఫీజంటూ అందిన వరకు దోచేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న రుణ పథకాల పేరుతో ఆన్‌లైన్ మోసగాళ్ల దోపిడీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలతో పోలీసులు సరిపెడుతున్నారు.

ఎక్కిళ్లు తప్పవా?

- వేసవి కార్యాచరణకు నిధుల లేమి
- రెండు నెలల క్రితం రూ.9.29 కోట్లతో ప్రతిపాదనలు
- నేటికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయని ప్రభుత్వం



నరసరావుపేట మున్సిపాల్టీలో నీటి శుద్ధి ప్లాంట్

ఎండలు మండుతున్నాయి.. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటిపోయాయి.. తాగునీటి ఇబ్బందులతో మున్సిపల్ పట్టణాల్లోని అనేక కాలనీల్లో ప్రజలు అల్లాడుతున్నారు.. సాధారణంగా ఈ పాటికి మున్సిపాల్టీలు ట్యాంకర్ల ద్వారా ప్రత్యేకంగా నీటి సరఫరా చేస్తుండేవి. అయితే నిధులు లేమితో ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు మున్సిపాల్టీల్లో నీటి సరఫరా కష్టాలు మొదలయ్యాయి. రెండు నెలల క్రితమే నీటి ఎద్దడిని ఊహించిన పుర పాలకులు ప్రభుత్వానికి మున్సిపాల్టీల వారీగా ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం నుంచి ఒక్కరూపాయి కూడా విడుదల కాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, తాగునీటి పథకాల మరమ్మతులను పురపాలకులు చేయలేకపోయారు. ఈ క్రమంలో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు మున్సిపాల్టీలు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశాయి. అయితే ఆ కార్యాచరణ అమలుకు నిధులు లేమి ఆటం కంగా మారింది. రెండు నెలల క్రితమే నీటి ఎద్దడి నెలకొనే ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.. కానీ ప్రభుత్వం నిధులు విడుదల కాకపోవడంతో పురపాలకులు అయోమయంలో ఉన్నారు. వేసవి ప్రణాళిక అమలు కోసం రెండు నెలల క్రితం రూ.9.29 కోట్లకు ప్రతిపాదలను పంపారు. దీనిపై ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల, గురజాల పట్టణాల్లో ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగడంలేదు. సాధారణంగా ఆయా మున్సిపాల్టీలో ప్రతీ వేసవిలోనూ తీవ్ర నీటి ఎద్దడి నెలకొంటుంది. ఈ సమస్యను అధిగమించేందుకు పుర పాలకులు ముందస్తుగా సిద్ధమైనా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. ప్రస్తుతం వినుకొండ, చిలకలూరిపేట పట్టణాల్లో రెండు రోజు లకు ఒక సారి నీటిని సరఫరా చేస్తు న్నారు. మా చర్ల, గురజాల మున్సి పాల్టీల్లో రెండు రోజులకు ఒక పూట నీటిని సరఫరా చేస్తున్నారు. దాచేప ల్లి, పిడుగురాళ్ల, గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు, సత్తెనపల్లి మున్సిపాల్టీల్లో ఒక పూట నీటి సరఫరా జరుగుతుంది. మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి, చీరాల, బాపట్ల రేపల్లె మున్సిపాల్టీల్లో రోజూ నీటి సరఫరా జరుగుతోంది.మూడు జిల్లాల్లో ఒక్క నరసరావుపేటలో మాత్రమే రోజూ రెండు పూటల పుష్కలంగా నీటిని సరఫరా చేస్తున్నారు.

ప్రతిపాదనలు ఇలా..

మున్సిపాల్టీ	నిధులు
పల్నాడు జిల్లా..	
నరసరావుపేట	రూ.1.62 కోట్లు
చిలకలూరిపేట	రూ.1.15 కోట్లు
వినుకొండ	రూ.70 లక్షలు
మాచర్ల	రూ.1.19 కోట్లు
గురజాల	రూ.30 లక్షలు
దాచేపల్లి	రూ.40 లక్షలు
పిడుగురాళ్ల	రూ.30 లక్షలు
సత్తెనపల్లి	రూ.15 లక్షలు
వినుకొండ	రూ.70 లక్షలు
గుంటూరు జిల్లా	
పొన్నూరు	రూ.44 లక్షలు
తెనాలి	రూ.52.50 లక్షలు
మంగళగిరి-తాడేపల్లి	రూ.80 లక్షలు
బాపట్ల జిల్లా..	
బాపట్ల	రూ.25 లక్షలు
అద్దంకి	రూ.21.50 లక్షలు
చీరాల	రూ.37 లక్షలు
రేపల్లె	రూ.88 లక్షలు

వేసవి ప్రణాళికలు ఇలా..

వేసవి నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు మున్సిపల్ అధికారులు రెండు నెలల క్రితమే సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించి మున్సిపాల్టీల వారీగా తాగునీటి పరిస్థితి.. సరఫ రా.. మరమ్మతులకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రణాళికల అమలు చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. చిలకలూరిపేటలో రూ.1.15 కోట్లతో వేసవి ప్రణాళిక సిద్ధం చేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.30 లక్షలు అవసరమని ప్రభుత్వానికి తెలిపారు. ఇలా ప్రతీ మున్సిపాల్టీలో వేసవి కార్యాచరణను సిద్ధం చేశారు. రెండు నెలలుగా నిధుల విడుదల కోసం పురపాలకులు ఎదురు చూస్తున్నారు.



చీరాల: వైపి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, పక్కన ఎస్పీ తుషార్‌డూడి

ప్రశాంతంగా.. నీట్

- 97 శాతం విద్యార్థులు హాజరు
- గుంటూరులో అత్యధికంగా 16 కేంద్రాల్లో పరీక్ష
- నరసరావుపేట, నాదెండ్ల, చీరాల, గుంటూరు తెనాలిలో కేంద్రాలు



గుంటూరు : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

చీరాల, నరసరావుపేట, నాదెండ్ల, గుంటూరు (విద్య), తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో ప్రవేశం కోసం జాతీయస్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆదివారం నిర్వహించిన నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరంలో 16 కేంద్రాలు, తెనాలిలో రెండు, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాలెంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, నరసరావుపేట సమీపంలోని కాకానిలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాల్లో పరీక్ష జరిగింది. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులు ఉదయం 11 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. నీట్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. తొలుత హాల్‌టికెట్లు పరిశీలించి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఆ తర్వాత బయోమెట్రిక్ సేకరించి, విద్యార్థుల ఫొటోలు తీసుకున్న తర్వాతే పరీక్ష హాల్‌లోకి పంపారు. ఆయా కేంద్రాల వద్ద ఎన్‌టీఏ నిర్దేశించిన డ్రెస్ కోడ్ పక్కాగా అమలు చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు, వాచీలు ధరించకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద గతంలో మాదిరిగా చెవిరింగులు, ఆభరణాలు తొలగించడం,ఫుల్ హ్యాండ్ షర్ట్‌లు కట్ చేయడం వంటి హడావుడి కని పించలేదు.అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు ప్రకటించారు.

- చీరాలలో వైపి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రా ల్లో జరిగిన పరీక్షకు 416 మందికి 12 మంది గైర్హాజరైనట్లు పరీక్షల సమన్వయకర్త, ఆర్డీవో చం ద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఆయా కేంద్రాలను కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ పరిశీలించారు. వారి వెంట నీట్ యూజీ నోడల్ అధికారి మృదుల, తహసీల్దార్ గోపీకృష్ణ, డీఎల్‌డీవో పద్మావతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మురళి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత తదితర సిబ్బంది పాల్గొన్నారు.
- నరసరావుపేట మండలంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, నాదెండ్ల మం డలం ఇర్లపాడులోని కేంద్రియ విద్యాలయంలో నీట్ జరిగింది.రెండు కేంద్రాల్లో పరీక్షకు 764 మంది విద్యార్థులకు 745 మంది హాజరయ్యారు. పరీక్షల సిటీ కో-ఆర్డినేటర్‌గా కేంద్రియ విద్యాల య ప్రిన్సిపాల్ నీరజ్‌కుమార్‌శ్రీవత్స, కో-ఆర్డినేటర్‌గా విజయకుమార్,పర్యవేక్షకుడుగా రొంపిచర్ల ఎంఈవోగా బ్రహ్మేశ్వరరావు వ్యవహరించారు. పరీక్షలకు ముందు ఇర్లపాడులోని కేంద్రం వద్ద ఆర్డీవో మధులత, తహసీల్దార్ రమణ విద్యాల యంలో వసతులను పరిశీలించారు. చిలకలూరి పేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.
- గుంటూరులో 4250 మంది విద్యార్థులకు 4153 మంది(97.71 శాతం) హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను నీట్ కోఆర్డినేటర్, కేంద్రియ విద్యాల య ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయ్‌కుమార్, డీఈవో రేణుక తదితరులు పరిశీలించారు.
- తెనాలిలోని కేంద్రియ విద్యాలయంలో 233 మంది విద్యార్థులకు 225 మంది, చెంచుపేటలోని కేఎస్‌ఎం హైస్కూల్‌లో 204 మందికి 197 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తహసీల్దారు గోపాలకృష్ణ తెలిపారు.

గుంటూరు-నడికుడి ట్రాక్‌కు.. రక్షణ

- 69 కిలోమీటర్ల పొడవునా ఫెన్సింగ్ ఏర్పాటు
- రైళ్ల స్పీడు 130 కిమీ పెంచేందుకు సన్నాహాక చర్యలు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలుచోట్ల రైలు మార్గాల పైకి పశువులు, మనుషులు చొరబడుతున్నారు. దీంతో రైళ్లను గరిష్ఠ వేగంతో నడపలేని పరిస్థితి. ఈ క్రమంలో గుంటూరు-నడికుడి మార్గాన్ని రైల్వేశాఖ దుర్భేద్యంగా మార్చేందుకు సిద్ధమైంది. సెక్షన్ స్పీడుని 110 నుంచి 130 కిలోమీటర్లకు పెంచేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రైలుమార్గానికి ఇరువైపులా యాంటీ క్రాష్ బ్యారియర్, ఆర్‌సీసీ ఇన్వర్టెడ్ టీ ప్యానల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నది. 23 కిలోమీటర్ల చొప్పున మూడు సెక్షన్లలో ఏడాది లోపు ఆయా పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో హఠాత్తుగా ట్రాక్‌పైకి వచ్చే పశువులను రైళ్లు ఢీ కొడుతున్నాయి. దాంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులతో పాటు వేగవంతగా నడపలేకపోతున్నారు. దీంతో రైళ్ల సమయపాలనపై ప్రభావం పడుతున్నది. జాతీయ రహదారులపై ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాటు చేస్తున్న యాంటీ క్రాష్ బ్యారియర్‌తో పశువుల చొరబాట్లకు అడ్డుకట్ట పడింది. దీంతో వాహనాలు గరిష్ఠ వేగంతో ప్రయాణించగలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైలుమార్గాలకు కూడా ఇదే మోడల్‌ని అనుసరించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లో చొరబాట్లకు అవకాశం లేకుండా ఇరువైపులా ఫెన్సింగ్ వేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. అయితే ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహార మైనా ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆయా పనులకు రైల్వేబోర్డు పచ్చజెండా ఊపింది. ఇందు కోసం రూ.29.89 కోట్లను రైల్వే శాఖ విడుదల చేసింది. దీంతో తొలి దశలో 69 కిలోమీటర్ల పొడవునా ఈ యాంటీ క్రాష్ బ్యారియర్, ఆర్‌సీసీ ఇన్వర్టెడ్ టీ ప్యానల్ ఫె న్సింగ్ నిర్మాణాలను చేపడుతున్నది. బిడ్డింగ్ ఈ నెల 8 నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు టెండర్‌ని ముగించి ఎవరైతే తక్కువ ధరకు బిడ్ దాఖలు చేస్తారో వారికే పనిని కేటాయించనుంది.



జలమయమైన చీరాల మండల పరిధిలోని ఈపురుపాలెం రహదారి

అకాల నష్టం

- రైతులకు కన్నీటిని మిగిల్చిన వర్షాలు
- కల్లాల్లో పంటలను కాపాడుకునేందుకు అగచాట్లు
- బాపట్ల జిల్లాలో వడగళ్ల వాన.. పిడుగుపాటుకు ఇద్దరి మృతి

బాపట్ల, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, మంగళగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉరుములు.. పిడుగులతో ఆదివారం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. వారం రోజులుగా ఎండ ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోగా ఆదివారం వాతావరణం చల్లబడటంతో ప్రజలు కొంత ఉపశమనం చెందారు. బాపట్ల జిల్లా పరిధిలో వడగళ్ల వాన వణికించింది. పిడుగుల కారణంగా ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. అకాల వర్షాల ధాటికి మామిడి, అరటి తోటలతో పాటు మొక్కజొన్న, మిర్చి తదితర పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలులకు వడగళ్లు తోడవడంతో మామిడికాయలు నేలరాలాయి. గాలి దుమారంతో అరటి తోటలు నేలకొరిగాయి. పర్చూరు ప్రాంతంలో మొక్కజొన్న, వైట్‌బర్లీ పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఉన్న ధాన్యం, మిర్చి, మొక్కజొన్న తదితర దిగుబడులను కాపాడుకోవడానికి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. దిగుబడులు తక్కువగా ఉండి నష్టాలు తప్పవనుకుంటున్న దశలో పడిన వర్షం తమ కష్టాలను రెట్టింపు చేశాయని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల దెబ్బకి ధాన్యం తడిసి రంగుమారడమో లేక తేమ శాతంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని రైతులు కన్నీటి పర్యంతమ వుతున్నారు. బాపట్ల, చీరాల ప్రాంతాలలో దాదాపు గంట పాటు ఉరు ములు బీభత్సం సృష్టించాయి. దీంతో ప్రజలు బయటకురావడానికే భయపడ్డారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో వర్షానికి ఈదురుగాలులు తోడై బీభత్సం సృష్టించాయి. రెండు మండలాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్థంభాలు నేలకు ఒరిగాయి. వృక్షాలు రోడ్డుకు అడ్డంగా విరిగి పడటంతో ట్రాఫిక్‌కు పలు చోట్ల అంతరాయం ఏర్పడింది. భట్టిప్రోలు ప్రధాన రహదారిపై పడిన భారీ వృక్షాలను ఎస్ఐ శివయ్య తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాలులకు అరటి తోటలు విరిగి పడగా, మామిడి, సపోటా, జామ తోటలలో కాయలు నేల రాలాయి. ఉన్నట్లుండి మబ్బులు కమ్ముకొచ్చి కొల్లిపర మండల పరిధిలో చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. కల్లాల్లో ఆరబట్టిన మొక్కజొన్న, జొన్న ఉత్పత్తులను కాపాడు కునేందుకు రైతులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఇటుక బట్టీలకు హడావిడిగా ప్లాస్టిక్ పట్టాలను కప్పుకున్నారు. తీరప్రాంతంలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల పరిధిలో చిరుజ ల్లులతో కూడిన వర్షం పడింది. పెదకూరపాడు ప్రాంతంలో సు మారు గంటసేపు ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో కల్లాల్లోని మిర్చి, పొగాకు ఉత్పత్తులు తడి చాయి. మంగ ళగిరిలో ఆదివారం ఉదయం గంటసేపు గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతోపాటు పెద్ద పెట్టున శబ్దం చేస్తూ పిడుగులు పడ్డాయి. ఈదురు గాలుల ధాటికి పలుచోట్లు హోర్డింగ్‌లు నేలకొరిగాయి.



కొల్లూరు : గాలులకు తోకలవానిపాలెంలో నేలకు ఒరిగిన విద్యుత్ స్థంభం

రెండు కుటుంబాల్లో విషాదం..

పిడుగులు రెండు కుటుంబాల్లో విషాదం నింపాయి. కృష్ణాజిల్లా మొవ్వ మండలం కోసూరు గ్రామానికి చెందిన వెల్డర్ మాతంగి సుప్రదీప్(25), వాగోలు అనీల్ కొల్లూరులో వెల్డింగ్ పని నిమిత్తం శ్రీకాకుళం-గాజుల్లంక మధ్య గాలు మార్గంలో వస్తుండగా పిడుగు పాటుకు గురయ్యారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సుప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక ఉన్న అనీల్ దూరంగా పడి గాయపడ్డాడు. కొల్లూరు వద్ద గొర్రెలు మేపుతున్న మహబూబ్‌నగర్ జిల్లా కోయలకొండ మండలానికి చెందిన అంజి వర్షం కురిసే సమయంలో పవర్‌బ్యాంకు నుంచి ఫోన్‌కు చార్జింగ్ పెట్టుకుని మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలోని రైతులు గుర్తించి 108లో కొల్లూరుకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తెనాలికి ఆ తర్వాత గుంటూరులోని జీజీహెచ్‌కి తరలించారు. అంజి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. చినగంజాం మండల పరిధిలోని రొంపేరు కాల్వ సమీపంలోని పొలాల్లో గేదెలు మేపుతుండగా గడ్డం బ్రహ్మయ్య అనే వ్యక్తి పిడుగుపడి మరణించాడు.

రహదారికి వీడని గ్రహణం

● ప్రయాణానికి తీవ్ర అవస్థలు పడుతున్న వాహనచోదకులు ● తక్షణమే నిధులు కేటాయించాలని వినతి

పర్చూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు - ఇంకొల్లు (పాత మద్రాసు) రోడ్డుకు గ్రహణం వీడడం లేదు. గుంతలు, కంకరరాళ్లతో అధ్వానంగా తయారైంది. దీంతో ఈ దారి వెంబడి ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు.



దగ్గుబాడు - ఇంకొల్లు మధ్య రోడ్డులో గుంతలు

నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పాతమద్రాసు రహదారిలో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారిలో ప్రయాణం ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు భయాందోళనకు గురి అవుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో అనేక మంది ప్రయాణీకులు ప్రమాదాలకు గురై, ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారు. రాత్రి పూట ప్రయాణాలు సాగించాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని రాకపో కలు సాగించాల్సి వస్తోందని ప్రయాణికులు పేర్కొం టున్నారు. వర్షాకాలంలో రోడ్లపై ఏర్పడిన భారీగుంతల్లో నీరు నిలిచిపోవడంతో గుర్తించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గుంతలు లేని రహ దారులు ఉండాలని ఆధికారులును ఆదేశించారు. అందుకు సంబంధించి తొలివిడతగా నిధులు మంజూరు చేశారు. దీంతో అనేక చోట్ల రహదారులకు యుద్ధప్రాతిపతిక మరమ్మతులు చేసి గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దారు. అయితే ఈజాబితాలో పర్చూరు - ఇంకొల్లు (పాత మద్రాసు) రోడ్డు నోచుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వహయాంలో ఈరోడ్డు నిర్మాణానికి రూ.22 కోట్లతో టెండర్ పిలిచారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి ఎన్ఎస్పీ కాలువలపై, దగ్గుబాడు వద్ద హైలెవల్ కల్వర్టులు నిర్మించారు. 200 మీటర్ల పొడవున చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు చేసేది ఏమిలేక పనులను అర్థాంతరంగా నిలిపివేశారు.



పర్చూరు - ఇంకొల్లు మధ్య రోడ్డు పరిస్థితి ఇలా

అప్పటి నుంచి ఈరోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు కేటాయించిన గడువు పూర్తికాకపోవటంతో ఈరోడ్డులో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోని విధంగా పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈమార్గంలో ప్రయాణాలు చేసే వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేకదృష్టి సారించి కనీసం రోడ్డులో ఏర్పడిన గుంతలకు అయిన మరమ్మతులు చేయించి వాహనదారుల అవస్థలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

రహదారి మరమ్మతులు పూర్తి



మరమ్మతులు పూర్తయిన రహదారి

పంగులూరు, మే 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పంగులూరు, తూర్పు కొప్పెర పాడు గ్రామాల మధ్య బీటీ రోడ్డు మరమ్మతు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. 'అసంపూర్తిగా ఆర్అండ్‌బీ రోడ్డు' శీర్షికతో ఏప్రిల్ 10న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన వార్తకు సంబంధిత ఆర్అండ్ బీ అధికారులు స్పందించారు. రోడ్డు మరమ్మతులు పూర్తి చేశారు. కొన్ని నెలలుగా అర్ధంతరంగా నిలిచిన ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులతో తారు వేసేందుకు రోడ్డుపై పరచిన పొడి కంకర పై ప్రయణం సాగించలేక ప్రజలు పడుతున్న సమస్యను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు ఈ రెండు గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల నిడివిలో ఛిద్రమైన రోడ్డుకు తగిన మరమ్మతులు చేపట్టి తారువేశారు. దీంతో రాకపోకల ఇబ్బందులు తొలిగాయి. అసంపూర్తిగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు పూర్తవడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

11న ఎడ్ల పోల్‌రాదా పోటీలు

చినగంజాం, మే 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని ఈ నెల 11న రెండు తెలుగు రాష్ట్రాల న్యూ జూనియర్ నాటుబండి పోలురాదా ఎడ్ల పందేలను నిర్వహించనున్నట్లు నిర్వహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో 11న ఉదయం 9 గంటలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలురాదా ఎడ్ల ప్రదర్శన పోటీలలో మొదటి బహుమతి రూ.30,116లు, రెండవ బహుమతి రూ.25,116లు, మూడవ బహుమతి రూ.20,116లు, నాల్గవ బహుమతి రూ.15,116లు, ఐదవ బహుమతి రూ.10,116లు, ఆరవ బహుమతి రూ.7,516లు అందజేస్తున్నట్లు తెలిపారు. పోలురాధ పందెములకు ఎంట్రీ ఫీజు రూ.1,000లు, బండిని ఆరుగురు మాత్రమే తోలవలెనని తెలిపారు. బండి మీద బరువు రెండు క్వింటాలు ఉంటుందని, తోకలు విరువరాదు, కర్రతో కొట్టరాదని తెలిపారు. పూర్తి వివరాలకు 9505272650, 9666377546, 7013806905 సెల్ నెంబర్లను సంప్రదించాలని నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు.

వెంకటసుబ్బారావుకు స్వర్ణ నంది పురస్కారం



స్వర్ణనంది పురస్కారం అందుకుంటున్న సిద్దు వెంకట సుబ్బారావు

పంగులూరు, మే 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్ధు వెంకట సుబ్బారావుకు స్వర్ణ నంది పురస్కారం లభించింది. సామాజిక, సేవారంగాలలో అందించిన విశిష్ఠ సేవలను గుర్తించి తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్, మాచవరం సేవా ఫౌండేషన్ వారు సిద్దు వెంకట సుబ్బారావుకు స్వర్ణనంది జాతీయ పురస్కారాన్ని అందచేశారు. హైదరాబాద్‌లోని త్యాగరాజ గాన సుధా భవనంలో ఏర్పాటు చేసిన జాతీయ పురస్కారాల కార్యక్రమంలో మాచవరం సేవా ఫౌండేషన్ ఛైర్మన్ గౌరీ శంకర్ , ఆధ్యాత్మిక గురువు దైవజ్ఞశర్మ, సాహితీవేత్త సూరేపల్లి విజయ, న్యూమరాలజిస్ట్ ముదికొండ గోపీకృష్ణలు సిద్దు సుబ్బారావును ఘనంగా సత్కరించి స్వర్ణనంది పురస్కారం బహూకరించారు. గతంలో ఢిల్లీలో దారుశిల్పి విశ్వకర్మ అవార్డును అందుకుని రెండు తెలుగు రాష్ట్రాలలో అవార్డు సాధించిన ఏకైక వ్యక్తిగా కీర్తినార్జించారు. జాతీయ స్వర్ణనంది పురస్కారం అందుకున్న సిద్దు వెంకట సుబ్బారావును ముప్పవరం గ్రామస్థులతోపాటు విశ్వబ్రాహ్మణ సంఘం మండల ప్రతినిధులు అభినందించారు.

ఘనంగా ప్రపంచ నవ్వుల దినోత్సవం



నిత్యావసరాలు అందజేస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఇతరుల పట్ల స్నేహ పూర్వకంగా మెలగాలని, అందరిపట్ల నవ్వులు పూయించాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ఆదివారం వారి ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. అలాగే అసోసియేషన్ సభ్యులు గోలి మల్లికార్జునుడు, ముంగిర శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా కోటయ్య అనాధ ఆశ్రమానికి నిత్యవసరాలు అందజేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురు ప్రసాద్, నారాయణమూర్తి, వీరాంజనేయులు, రమేష్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో డ్రోన్‌తో పోలీసుల పర్యవేక్షణ



డ్రోన్ పర్యవేక్షణలో అద్దంకి

అద్దంకి, మే4(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో పోలీసులు డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ సమయంలో డ్రోన్‌తో నామ్ రోడ్డుతో పాటు ఇతర ప్రధాన రోడ్లలో డ్రోన్ కెమెరాతో ఫోటోలు, వీడియో లు తీసి వాటి ఆధారంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనచోదకులు, రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వాహన చోదకులను గుర్తించటం జరుగుతుందని సిఐ సుబ్బరాజు తెలిపారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగించినా, ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సమయంలో డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి నిబంధనలు ఉల్లంగిస్తే కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు.

నా మద్దతు.. మా కౌన్సిలర్లకే..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మే 4 (ఆంధ్రజ్యోతి) : 'నాతో పాటు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మద్దతు మా వర్గం కౌన్సిలర్లకే ఉంటుంది. అవిశ్వాసం పక్కా.. ఆ విషయం పార్టీలో చేరేందుకు చర్చలు జరుపుతున్న సమయంలోనే మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు చెప్పా. అవిశ్వాసం అనేది మా వర్గం కౌన్సిలర్లు గట్టిగా తీసుకున్న నిర్ణయం' అని ఎమ్మెల్యే కొండయ్య స్పష్టం చేశారు. ఇటీవల జంజనం పార్టీలో చేరిన విషయమై ఆయన వర్గం కౌన్సిలర్లు కొద్దిరోజులు అలకబూనారు. దీంతోపాటు ప్రధానీ మోదీ కార్యక్రమానికి సైతం దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం తన వర్గం కౌన్సిలర్లతో క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంజనంతో బే దా భి ప్రా య ా ల ు లేవన్నారు. రాజకీయ సమీకరణాల నేపథ్యంలో చోటుచేసుకున్న అంశమే అవిశ్వాసమన్నారు. ఈక్రమంలో వీటన్నింటి పట్ల జంజనం కూడా తప్పని పరిస్థితులతో సానుకూలంగా ఉన్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. దీంతో కౌన్సిలర్లకు పీఠముడి వీడింది. అయితే ఇదే గనుక జరిగితే ఒకవేళ బలపరీక్షలో జంజనంపై నెగ్గితే ఛైర్మన్ ఎవరన్నది ఎమ్మెల్యే మాటే శిరోధార్యమని కౌన్సిలర్లు కూడా ఏకీభవించారు. అయితే ప్రస్తుత వాస్తవ పరిస్థితులు గమనిస్తే విషయం కాస్తంత విడ్డూరంగా ఉన్నా, ఛైర్మన్ సీటుపై కన్నేసిన కొందరు కౌన్సిలర్లు కారణంగా అవిశ్వాసం తప్పేలా కనిపించడం లేదు.

అకాల వర్షం.. ఉప్పు పంటకు భారీ నష్టం



ఉప్పుమడుల్లో నిలిచిన వర్షంనీరు

చినగంజాం, మే 4(ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో ఓ వైపు తీవ్రంగా ఎండకాస్తున్నప్పటికీ, మరోవైపు మబ్బులు పట్టి ఆదివారం అనుహ్యంగా వర్షం పడింది. దీంతో ఉప్పు పంటకు భారీ నష్టం కలిగింది. ఉప్పు మడుల లో తీత తీయవలసిన ఉప్పు వర్షపు నీటికి కరిగి పోగా, ఎక్కాలపై తీసి ఉంచిన ఉప్పు, నట్టులపై(ప్లాట్‌ఫాం)నిల్వ ఉంచిన ఉప్పు కరిగిపోయిందని ఉప్పు రైతులు వాపోతున్నారు. వర్షం కురుస్తుందని సూచనలు ఉన్నట్లయితే ఉప్పు నిల్వలపై పట్టలు కప్పుకొని రైతులు కొంత మేర నష్టాన్ని తగ్గించుకునే వారు. అకస్మాత్తుగా వర్షం రావడంతో నష్టం చవి చూడవలసి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పుమడులలో ఉన్న ఉప్పుని ఆదివారం సాయంత్రం, సోమవారం తీయవలసి ఉండగా, వర్షంతో మడులలో నీరు నిలిచిందన్నారు. దీంతో ఉప్పుమడులలో నిలిచి కరిగిపోయిందని తెలిపారు. ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు నష్టం వాటిల్లిందన్నారు. మండలంలోని అడవీధిపాలెం, సోపిరాల, చినగంజాం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం. పెద గంజాం ప్రాంతాల్లో రెండు వేల ఎకరాల్లో తీయవలసిన ఉప్పు కరిగిపోయింది. మరోసారి ఉప్పు రావడానికి వాతావరణం అనుకూలంగా ఉంటే 15 రోజులు పడుతుం దని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఉప్పు క్వింటా బస్తా ధర రూ.400ల వరకు ఉంది. ఉప్పు ధరలు అనుకూలంగా ఉండడంతో మంచిలాభాలు ఆర్జించవచ్చని అనుకుంటున్న సమయంలో అకాల వర్షం ఆశలు ఆడియా శలు చేసిందని ఉప్పు రైతులు వాపోయారు. వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో వాహనదారులకు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

శింగరకొండలో రాతి ముఖమండప నిర్మాణం పూర్తి



దేవాలయం వద్ద పూర్తయిన రాతి ముఖ మండపం

అద్దంకి, మే4(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.6.35 కోట్లతో రాతి ముఖ మండపం నిర్మాణం పూర్తయ్యింది. తిరుపతి తిరుమల దేవస్థానం నుంచి రూ.2 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ నిధులు రూ.2 కోట్లు మంజూరుకాగా, దాతల నుండి మరో రూ.2.35 కోట్లు సేకరించి రాతిముఖ మండపం నిర్మాణం పూర్తి చేశారు. ఈ నెల 14న నుంచి ప్రసన్నాంజనేయస్వామి విమాన శిఖర జీవధ్వజ ప్రతిష్ఠాపూర్వక మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 19న ఉదయం 9-03 గంటలకు శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకము నిర్వహించనున్నారు. 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. 19న సోమవారం ఉదయం 6 గంటలకు అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుండి 1008 మంది మహిళలతో తీర్థకలశ యాత్ర శింగరకొండ వరకు సాగనుంది. ఉదయం 8 గంటలకు గురువందనము, గణపతి పూజ, మండల పూజలు, వేద పారాయణం, సుందర కాండ పారాయణం, శాంతి వాహనములు, మహాపూర్ణాహుతి, జగద్గురువులతో మహాకుంభాభిషేకము, 9-03 గంటలకు ధ్వజయంత్ర స్థాపన, జీవధ్వజ స్థంభ ప్రతిష్ఠ విమాన శిఖర కుంభాభిషేకము శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి ఆధ్వర్యంలో జరుగుతా యని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 11 గంటలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. 14 వ తేది నుండి 19వ తేదీ వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన లు కూడా జరుగుతాయన్నారు. రెండు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పొగాకు కంపెనీలపై రైతు సంఘాల నేతల ఆగ్రహం

● వ్యాపారులు సిండికేట్‌గా మారారని ధ్వజం



మాట్లాడుతున్న హరిబాబు

పర్చూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : పొగాకు కంపెనీల ప్రతినిధులపై రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రైతుల సంఘాల నాయకులు పర్చూరు లోని సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసదర్భంగా రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ క్వింటా రూ.15వేలకు కంపెనీలు రైతుల నుంచి బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ ఉన్నా కంపెనీలు సిండికేట్‌గా మారి ధరను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ కమీషన్ పొగాకు పండించిన ప్రాంతాన్ని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, బాపట్ల జిల్లా రైతుసంఘం కార్యదర్శి టి.రామారావు, కౌలురైతు సంఘం నాయకులు సిహెచ్ గంగయ్య, సీపీఎం నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నివాసగృహంపై పిడుగుపాటు

ఇంటిలోని సామగ్రి ధ్వంసం

స్వర్ణ (పర్చూరు), మే 4 (ఆంధ్రజ్యోతి) :ఆదివారం కారంచేడు మండలంలో సంభవించిన ఈదురుగాలు, ఉరుములతో కూడిన వర్షంతో ప్రజలు భయాందోళనకు గురిఅయ్యారు. పెద్ద ఎత్తున వర్షం కురవటంతోపాటు, గాలిదురమారం కూడా తోడుకావటంతో ప్రజలు నివాసాలకే పరిమితం అయ్యారు. మండంలోని స్వర్ణ గ్రామంలో నీరుకట్టు దయా శేఖర్ బిల్డింగ్‌పై ఉన్న వాటర్ ట్యాంకుపై పిడుగు పడటంతో ట్యాంకు ధ్వంసం అయ్యింది. దీంతోపాటు ఇంటిలో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు, ఇన్వర్టర్, టీవీ, ఫ్యాన్‌వంటి సామానులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పిడుగు పడిన తరుణంలో పెద్ద శబ్దం రావటంతో గ్రామస్తులు ఆందోళనకు గురిఅయ్యారు.

పోలేరమ్మకు పూజలు ప్రారంభం



చిన్నగంజాంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

చినగంజాం, మే 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవ పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామంలోని మహిళాభక్తులు ఉదయం చద్ది నైవేద్యాలు, సాయంత్రం వడపప్పు, పానకంలను మంగళవాయిద్యాలు, కనక తప్పెట్లలతో గ్రామంలోని పురవీధుల నుంచి అమ్మవారి ఆలయానికి తీసుకొని వెళ్లి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు.

కామేపల్లిలో అన్నదానం

సంతమాగులూరు : మండలంలోని కామేపల్లి గ్రామంలో ఉన్న శివాలయం 25వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శివపార్వతి ఉత్సవ విగ్రహాలను భారీ ఊరేగింపు చేశారు. పల్నాడు, గుంటూరు జిల్లా నుండి భక్తులు భారీగా పాల్గొన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామంలో భక్తులతో సందడి నెలకొని తిరునాళ్ల వాతావరణం తలపించింది. ఈ సందర్భంగా గ్రామ శివాలయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

7న ఆరాధన మహోత్సవం

మార్టూరు :మండల పరిధిలో బొబ్బేపల్లి దండుదారి వద్ద శ్రీ గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల దేవస్థానంలో ఈ నెల 7న బుధవారం ఉదయం ఆరాదన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఉమామహేశ్వరుని కల్యాణం

మేదరమెట్ల : దైవాలరావూరులో శ్రీ హరసాయి హనుమత్ క్షేత్రం 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి వార్షికోత్సవ వేడుకలు పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యాయి. గణపతిపూజ, హోమం, పంచామృతాభిషేకాలతో పాటు సహస్రనామ అర్చనలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం ఆదిదంపతులైన ఉమమహేశ్వర కల్యాణాన్ని ఘనంగా భక్తి శ్రద్దలతో ఆలయ పూజారి రాజశేఖరశర్మ పండితులు నిర్వహించారు. కల్యాణం అనంతరం రాత్రికి స్వామి, అమ్మవార్లతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం

● వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం



బుజ్జిబాబు(ఫైల్‌ఫోటో)

వేటపాలెం(చీరాల), మే 4 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పి మైనర్ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండల పరిధిలోని చీరాల రోడ్డులోని నూనె మిల్లు సమీపంలో చోటుచేసుకుంది. వేటపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., మండల పరిధిలోని చేనేతపురి కాలనీకి చెందిన సరిసిని బుజ్జిబాబు(17) ద్విచక్ర వాహనంపై చీరాలకు వస్తున్నాడు. ఈక్రమంలో వేటపాలెం - చీరాల రోడ్డులోని నూనె మిల్లు సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను వేగంగా ఢీ కొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన బుజ్జిబాబును స్థానికులు చీరాల్లోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుమారుడి మృతి విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్దకు చేరుకుని బోరున విలపించారు.

ఇద్దరు బాటసారులకు గాయాలు

బల్లికురవ, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెన్నుపల్లి రోడ్డులో ఆదివారం గుర్తుతెలియని బైకుఢీకొని ఇద్దరు బాటసారులకు తీవ్రగాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన అంజయ్య, కోటేశ్వరరావులు చెన్నుపల్లి గ్రామానికి నడిచి వెళుతున్నాడు. ఇదేసమయంలో ఎదురుగా వస్తున్న బైకు వారిని ఢీకొట్టి వెళ్లింది. వెంటనే రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న ఇరువురిని బల్లికురవ 108 సిబ్బంది ప్రథమచికిత్స చేసి అనంతరం వారిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

తూర్పు తక్కెళ్ళపాడులో అగ్ని ప్రమాదం

● సుబాబుల్‌తోట దగ్ధం ● రెండున్నర లక్షలకు పైగా ఆస్తినష్టం



తగలబడుతున్న పొలాలు

పంగులూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు పంట పొలాలలో అగ్ని ప్రమాదం చోటు చేసుకొంది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మేడూరి కాశీంకు చెందిన కోతకోసిన మొక్కజొన్న కంపకు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న సుబాబుల్ తోటలకు వ్యాపించి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో రైతులు ఎనికపాటి వెంకటేశ్వర్లు, కృష్ణ, సుందరరావులకు చెందిన రెండెకరాల సుబాబుల్ తోటలకు మంటలు వ్యాపించడంతో నష్టంవాటిల్లింది. ఈ అగ్నిప్రమాదంలో ఆయా రైతుల పొలాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి పీవీసీ పైపులు, ప్యానల్ బాక్స్‌లతో పాటు స్ప్రింక్లర్లు గొట్టాలు కాలి బూడిదయ్యాయని రైతులు తెలిపారు. కాశీంకు చెందిన కోతకోసిన మొక్కజొన్న చేలో గొర్రెలు మేపుకుంటున్న సమయంలో గొర్రెల కాపర్ల అజాగ్రత్తతో ఈ ప్రమాదం సంభవించినట్లు రైతులు భావిస్తున్నారు. అగ్నిప్రమాదాన్ని గమనించిన గ్రామ రైతులు సమీప పొలాలలోని వ్యవసాయ పంపుసెట్ల నుండి నీటిని మళ్లించి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండున్నర లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.

పారవేశారా ? పడిపోయిందా ?

● చెత్తకుప్పలో పొగాకు బేళ్ల దర్శనం

● చర్చనీయాంశంగా మారిన చెత్తకుప్పలో పొగాకు



ఉప్పుటూరు వంతెన సమీపంలోని చెత్తకుప్పలో పొగాకు బేళ్లు

పర్చూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు బేళ్లు చెత్తకుప్పలో దర్శనం ఇవ్వడం చర్చానీయాంశంగా మారింది. రైతులు తమ పంట పొలాల నుంచి వాహనాల్లో తరలించే క్రమంలో వాహనంలో నుండి జారీ పడిపోయాయా..? లేదా ఇటీవల కురిసిన వర్షాలకు పాడైపోయిన బేళ్ళను చెత్తకుప్పలో పారవేశారా..? అన్న అంశం తెలియాల్సి ఉంది. అయితే బర్లీ పొగాకు రైతుల సమస్యపై ఇప్పటికే స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి సమస్యను తీసుకుపోయారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అధికారుల సారధ్యంలో పొగాకు కంపెనీ ప్రతినిధులు, రైతులు, రైతుసంఘ నేతలతో సమావేశం నిర్వహించారు. తక్షణ చర్యల్లో భాగంగా పొగాకు కొనుగోలుకు కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేసింది. ఇలాంటి తరుణంలో చెత్త కుప్పలో బర్లీ పొగాకు ఏదైన ప్రత్యక్షం కావడం చర్చనీయాంశమైంది. దీనిపై రాజకీయ కోణమా మరే ఇతర కోణాలు ఉన్నాయా..? అన్న విషయం విచారణలో తెలియాల్సి ఉంది.

విద్యుత్ ప్రమాదం నిర్లక్ష్యంపై చర్యలు

చీరాల, మే 4 (ఆంధ్రజ్యోతి) : పేరాల జక్కావారి వీధిలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ లైన్‌మ్యాన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీకు చెందిన జడ సునీల్(25)ఘోరంగా మృతిచెందాడు. ఈనేపధ్యంలో ఆదివారం ఏరియా హాస్పిటల్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులతో ఘటనపై ఆరా తీశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అండగా ఉండి ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

మేదరమెట్ల, మే 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి వెంబడి కొరిశపాడు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్దుడు మృతిచెందాడు. ఆదివారం వేకువజామున దైవాలరావూరుకు చెందిన గాలి వీరయ్య (65)ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో డివైడర్‌పై పడి ఆయన మృతి చెందాడు. ఉదయం వీరయ్య మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.4	27.2
కావలి	38	28
ఆత్మకూరు	41	28
ఉదయగిరి	38	27
కందుకూరు	37	28

ఆ రోడ్లు బాగు పడేదెప్పుడో..?

- ప్రభుత్వం ఓకే అన్నా... పనులు చేపట్టని అధికారులు
- మార్చిలో 13 రహదారుల మరమ్మతులకు నిధులు
- 95.31 కి.మీ మేర గుంతలు పూడ్చేందుకు అనుమతులు
- ప్యాచ్ వర్కులకు రూ.34.35 కోట్లు మంజూరు
- నెలగడిచినా టెండర్లు పిలవని ఆర్‌అండ్‌బీ
- ఇక తాజాగా మంజూరైన రోడ్ల పరిస్థితేమిటో..?

నెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది ఆర్‌అండ్‌బీ రోడ్ల పరిస్థితి. గుంతలమయంగా మారిన రహదారులను బాగు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఇంతవరకూ ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవలేదు. ప్రభుత్వం జీవో ఇచ్చి నెల గడిచినా కూడా ఇప్పటికీ ముందడుగు పడక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ఇక ఎప్పుడు టెండర్లు పిలుస్తారు..? పనులు ఎప్పుడు మొదలు పెడతారు..? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. రాష్ట్రస్థాయిలో చీఫ్ ఇంజనీర్లు టెండర్ల ప్రక్రియపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతుండడం గమనార్హం.



గుంతలతో అధ్వానంగా ఉన్న నందవరం- ఉదయగిరి రోడ్డు

మార్చిలో జిల్లాకు మంజూరైన నిధుల వివరాలు

రోడ్డు పేరు	బాగుచేయనున్న దూరం (కి.మీ)	నిధులు (రూ.లక్షలు)
బ్రహ్మదేవం-పొట్టెంపాడు రోడ్డు	1.30	50
మనుబోలు-కొలనకొదురు రోడ్డు	4	200
దువ్వూరు-ముక్తాపురం రోడ్డు	6.23	225
ఎంసీ రోడ్డు- కొండబిట్రగుంట రోడ్డు	5.19	200
కోవూరు-ఊటుకూరు రోడ్డు	13.90	350
నెల్లూరు-తాటిపర్తి రోడ్డు	2	80
సంగం-విరువూరు-కలువాయి రోడ్డు	18.40	850
పొదలకూరు-సోమశిల రోడ్డు	1	50
గూడూరు-దుగరాజపట్నం రోడ్డు	7.60	300
ఎన్‌హెచ్16 - వరగలి రోడ్డు	3.20	180
ఓజిలి - గొల్లపల్లి రోడ్డు	8.60	320
నందవరం - ఉదయగిరి రోడ్డు	13.89	250
మనుబోలు - పొదలకూరు రోడ్డు	10	350

● నిధులిచ్చి నెల దాటింది..

జిల్లాలో ప్రధాన రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో జిల్లా ప్రధాన రహదారులతో పాటు రాష్ట్ర రహదారులు కూడా ఉన్నాయి. మొత్తం 13 రోడ్లపై 95.31 కిలోమీటర్ల మేర ఉన్న గుంతలకు ప్యాచ్‌లు వేసేందుకు నిర్ణయించారు. అందుకు గానూ రూ.34.35 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తం గా 536 కిలోమీటర్ల దూరం ఎండీఆర్(జిల్లా ప్రధాన రహదారులు) రోడ్లను బాగు చేసేందుకు రూ.200 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమ తులు జారీ చేయగా, అందులో ఆర్‌అండ్‌బీ నెల్లూరు సర్కిల్‌కు 30.62 కి.మీ బాగు చేసేందుకు గానూ రూ.10.55 కోట్లు మంజూరయ్యాయి. అలానే రాష్ట్ర వ్యాప్తంగా 890 కి.మీ రాష్ట్ర రహదారులు(ఎస్‌హెచ్) బాగు చేసేందుకు రూ.400 కోట్లు మంజూరు కాగా, అందులో ఉమ్మడి జిల్లాకు 64.69 కి.మీ బాగు చేసేందుకు రూ.23.80 కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ సెక్రటరీ కాంతీలాల్ దండే మార్చి 29న ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రధాన కనెక్టివిటీ రోడ్లు ఈ జాబితాలో ఉన్నాయి. నెలలోపు టెండర్లు పిలిచి మూడు నెలల్లోపు పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రచించుకున్నారు. ప్రభుత్వం కూడా రానున్న వర్షాకాలం సీజన్‌లోపు ఎక్కడా కూడా రోడ్లపై గుంతలు కనిపించకూడదని ఆదేశించింది. అయితే ప్రభుత్వం నుంచి పరిపాలనా,ఆర్థిక అనుమతులు మంజూరుచేస్తూ జీవో విడుదలైనా, రోడ్లను బాగు చేసే విషయంలో ముందడుగు పడలేదు.

● నాబార్డు ద్వారా మరో రూ.16.30 కోట్లు

మార్చిలో 13 రోడ్లకు రూ.34.35 కోట్లను జిల్లాకు మంజూరు చేసిన ప్రభుత్వం తాజాగా నాబార్డు కింద మరో ఆరు రోడ్లను బాగు చేసేందుకు ఇంకో రూ.16.30 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు నాలుగు రోజుల క్రితం జీవో విడుదలైంది. వరిగొండ - జంగాలకండ్రిగ రోడ్డుకు రూ.3 కోట్లు, అన్నారెడ్డిపాలెం-దువ్వూరు రోడ్డుకు రూ.2.30 కోట్లు, వింజమూరు-కలిగిరి-బద్వేలు రోడ్డుకు రూ.2.50 కోట్లు, కరేడు ర్యాంప్ - చేవూరు రోడ్డుకు రూ.2.50 కోట్లు, గండవరం- పెదపుత్తేడు-ఊచగుంటపాలెం రోడ్డుకు రూ.2 కోట్లు, వరిణి-వీరారెడ్డిపాలెం రోడ్డుకు రూ.2.50 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా రహదారులపై ఉన్న గుంతలను పూడ్చనున్నారు. మరి ఈ రోడ్లకు ఎప్పటికీ టెండర్లు పిలుస్తారోనన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఒంగోలులో రోడ్డు ప్రమాదం

- జిల్లా వాసులు ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు గుడిపల్లిపాడుకి చెందిన కూలీలు
- మరొకరు నెల్లూరు వెంగళరావునగర్ వాసి



తిరగబడిన కోడిగుడ్ల లారీ



కోడిగుడ్ల లారీ బోల్తా పడటంతో మృతి చెందిన బాబు, నాగేంద్ర, రమణయ్య

ఒంగోలు క్రైం / కార్పొరేషన్/నెల్లూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలో కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ప్రమాదంలో నెల్లూరు జిల్లా వాసులు ముగ్గురు మృతిచెందారు. అతివేగమే ప్రమాదానికి కారణమైంది. ముందు పంక్చరై ఆగి ఉన్న వాహనాన్ని కోడిగుడ్ల లారీ ఢీకొట్టడం, దాన్ని ఆ వెంటనే వెనుక నుంచి వరి కోత మిషన్ తో వస్తున్న లారీ ఢీకొట్టడంతో కోడిగుడ్ల లారీ బోల్తా కొట్టింది. అందులో ఉన్న నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లి పాడుకు చెందిన రావి నూతల బాబు (42), రావి నూతల నాగేంద్ర (18), నెల్లూరు టౌన్‌లోని వెంగళ రావు నగర్‌కు చెందిన డ్రైవర్ షేక్ రహీం అలియాస్ రమణయ్య (60) అక్కడికక్కడే మృతి చెందారు.

● పనిలో.. చావులో కలిసే ప్రయాణం

వారివి రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబాలు. నెల్లూరులోని కోడిగుడ్ల వ్యాపారి వద్ద ఒకరు డ్రైవర్‌గా, మరో ఇద్దరు హెల్పర్‌లుగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. నిత్యం కలిసి ఉండేవారు ఒకేసారి ప్రాణాలు కోల్పోయారు. కోడిగుడ్ల వ్యాపారి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న రమణయ్య, బాబు, నాగేంద్రలు హైదరాబాద్ వెళ్లి కోడిగుడ్లను లోడ్ చేసుకుని తిరిగి నెల్లూరు వెళ్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో అక్కడికకక్కడే మృతి చెందారు. రమణయ్యకు భార్య నలుగురు సంతానం ఉన్నారు. వీరిలో ఒక అమ్మాయికి పెళ్లిచేసి అత్తారింటికి పంపారు. ఒక అబ్బాయి, ఇద్దరు కూతుర్లు ఉండగా వారికి రమ ణయ్య పెద్దదిక్కు. ఆయన పనిచేసి పైసలు తెస్తేనే వారి కుటుంబం గడిచేది, ఆయన మృతితో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధిస్తున్నారు. మరో మృతుడు బాబుకు భార్య, ఇంటర్ చదవుతున్న కుమార్తె, ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. బాబు మరణంతో ఆ కుటుంబం అంతులేని శోకంలో మునిగిపోయింది. మరో మృతుడు నాగేంద్ర కోడిగుడ్లు అమ్మే వాహనానికి హెల్పర్‌గా వెళుతూ వృద్ధులైన తల్లిదండ్రులకు అండగా ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో నాగేంద్ర అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోవడంతో ఆయన తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు. బాబు, నాగేంద్ర సమీప బంధువులు కావడం మరింత విషాదకరం.



రావినూతల బాబు (ఫైల్)



రావినూతల నాగేంద్ర (ఫైల్)



ఉత్కంఠ : హాల్‌టిక్కెట్ నెంబర్ ఎక్కడుందో... రూమెక్కడో..?



విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు

- కట్టుదిట్టంగా పరీక్ష నిర్వహణ
- కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

'నీట్'కు 97.90శాతం మంది హాజరు

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్(నీట్-యూజీ) ప్రవేశ పరీక్షను ఆదివారం నెల్లూరులో కట్టుదిట్టంగా నిర్వహించారు. ఈ పరీక్షకు కఠిన నిబంధనలు అమలు చేయడంతో విద్యార్థులు అనుకున్న సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అయితే కొన్ని కేంద్రాల వద్దకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను మాత్రం అనుమతించలేదు.

● ప్రశాంతంగా పరీక్ష

నీట్ పరీక్ష కట్టుదిట్టమైన నిబంధనల మధ్య ప్రశాంతంగా జరిగింది. నగరంలో 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 97.90శాతం మంది విద్యార్థులు హాజరయినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఒక జిల్లా అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. పరీక్ష కేంద్రంలో కాపీయింగ్, పేపర్‌లీకేజీకి ఆస్కారం లేకుండా కఠిన నిబంధనలు అవలంభించారు. ఉదయం 11 నుంచే తనిఖీలు ప్రారంభించి 1.30 గంటలకు విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించారు. మొత్తం విద్యార్థులు 2,913 మంది కాగా పరీక్షకు 2,852 మంది హాజరయ్యారు 61 మంది గైర్హాజరయ్యారు.



నీట్ పరీక్ష కేంద్రమైన నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం

● మెటల్ డిటెక్టర్లతో పరిశీలన

విద్యార్థుల వస్త్ర. దారణ, ఆభరణాలపై కూడా ఆంక్షలు విధించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమరాలు, జామర్‌లు ఏర్పాటు చేయడం తో పాటు పటిష్టమైన మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు నిర్వహించారు. హ్యాండ్‌బ్యాగులు, బెల్టులు, టోపీ, డెబిట్, క్రెడిట్ కార్డులతో సహా చేతికి వాచీ ధరించినా అనుమతించలేదు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థుల కోసం తల్లిదండ్రులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దనే వేచి ఉన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు కొందరు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రశ్నపత్రం చాలా కఠినంగా వచ్చిందన్నారు. అత్యధికశాతం మంది విద్యార్థులు పలు కేంద్రాల వద్ద కన్నీంటి పర్యంతం కాగా తల్లిదండ్రులు సర్దిచెపుతూ కనిపించారు.

క్రీడలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి

- ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా అమలుకు జీవో జారీ
- శాప్ చైర్మన్ రవినాయుడు
- వీఎస్‌యూలో పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నీ ప్రారంభం
- తొలిరోజు పోటీలు హోరాహోరీగా...



ప్రసంగిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

వెంకటాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో ఆదివారం అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీతలతో కలిసి ఆయన ప్రారంభించారు. మొదటగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను ప్రారంభించి, మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమంగా ఏపీలోనే స్పోర్ట్స్ పాలసీని ప్రభుత్వం రూపొందించిందన్నారు. ప్రణాళికాబద్ధంగానే దాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించేలా విద్యాశాఖమంత్రి లోకేష్ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. స్పోర్ట్స్ పాలసీలో పొందుపరిచిన రిజర్వేషన్ 3 శాతం అమలుకు జీవో జారీ చేసి, క్రీడల పట్ల సీఎం చంద్రబాబు తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటా 3శాతం అమలుతో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగసంస్థలు, పోలీస్, ఎక్సైజ్, అటవీశాఖలతోసహా యూనిఫామ్ సర్వీసులన్నింటిలోనూ రాత పరీక్షలు లేకుండానే క్రీడాకారులకు నేరుగా నియామకాలు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కుంకాల నాగేంద్రప్రసాద్, రావూరి రాధాకృష్ణమనాయుడు, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, సర్వేపల్లి కాలువ డిస్ట్రిబ్యూషన్ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి, వివిధ యూనివర్సిటీల క్రీడాకారులు, కోచ్‌లు, రెఫరీలు, వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● హోరాహోరీగా మ్యాచ్‌లు

సాఫ్ట్‌బాల్ టోర్నీకి దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల నుంచి 97 జట్లు హాజరయ్యాయి. కాగా తొలిరోజు 30 మ్యాచ్‌లు జరిగాయి. ప్రతి మ్యాచ్ హోరాహోరీగా సాగింది. వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత దగ్గరుండి పోటీలను పర్యవేక్షించారు. ఈనెల 8 వరకు పోటీలు జరగనున్నాయి. కాగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వీఎస్‌యూకి వచ్చి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను తిలకించారు.



హోరాహోరీగా తలపడుతున్న జట్లు

జిల్లాలో వర్ష బీభత్సం

- జోరుగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
- పలుచోట్ల విద్యుత్ అంతరాయం
- సాయంత్రం ఉన్నట్టుండి వర్షం
- పిడుగుపాటుకు వ్యక్తి మృతి
- ఒక్కసారిగా మారిన వాతావరణం

నెల్లూరు (హరనాథపురం) మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం రెండున్నర గంటలపాటు గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. మెట్ట ప్రాంతాల్లో కూడా వర్షం పడడంతో ఆ ప్రాంతరవాసులు ఆనందపడ్డారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం మూడుగంటల వరకు తీవ్రమైన ఎండతో ప్రజలు నానాఅవస్థలు పడ్డారు. సాయంత్రం 3 నుంచి 5.30గంటల వరకు గాలివాన వచ్చింది. కాగా నెల్లూరు నగరంలో నీట్ పరీక్షను రాసేందుకు పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చారు. వారంతా వర్షంలో తడిసి ముద్దయ్యారు. మెట్ట ప్రాంతాల్లో వర్షం పడడంతో ఉద్యాన పంటలకు కొంతమేర నష్టం వాటిల్లినట్లు సమాచారం. నష్టాల వివరాలు తెలియాల్సి ఉంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

● పిడుగు పాటుకి వ్యక్తి మృతి

రాపూరు మండలంలోని రావిగుంటపల్లి గ్రామానికి చెందిన తాటి బోయిన చిన్నయ్య (50) గొర్రెలు మేయడానికి అడవికి వెళ్లగా, పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

● నేలకూలిన విద్యుత్ స్తంభాలు

ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు కావలి ముసు నూరు దివ్యాంగుల కాలనీలో 11 కేవీ విద్యుత్ స్తంభం విరిగి తీగల ఆపున ఊగసాగింది. దీంతో ఒక్కసారిగా మంటలు రేగి సరఫరా నిలిచి పోయింది. అలాగే కొండాపురం మండల పరిధిలో ఒక్కసారిగా బలమైన ఈదురుగాలులు వీచడంతో కొమ్మి సబ్‌స్టేషన్ నుంచి సత్యవోలుకు విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ లైనులోని రెండు స్తంభాలతోపాటు లింగనపాలెంలో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే పలు గ్రామాలలో చెట్లు నేలకొరిగాయి.





ఈదురుగాలులకు ముత్తుకూరు,కొండాపురం మండలం లింగనపాలెంలో నేలకూలిన చెట్లు

● ముత్తుకూరులో ఈదురు గాలుల తాకిడికి పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఎంపీడీవో కార్యాలయం వద్ద నీడనిచ్చే వృక్షం గాలి తాకిడికి విరిగి పడిపోయింది. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



పిడుగుపాటుకు మృతి చెందిన చిన్నయ్య

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258
కోడిగుడ్ల ధర (100)	480

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9018
వెండి కిలో ధర	రూ. 96.100
వెండి ఒక గ్రాము	రూ.99.10

హెడ్‌కానిస్టేబుల్ రక్తదానం

కందుకూరు, మే 4(ఆంధ్రజ్యోతి): ఓ పేషెంటుకు అత్యవసరంగా ఓ నెగటివ్ రక్తం అవసరమని తెలిసి కందుకూరు సర్కిల్ ఆఫీసులో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ నర్రా శంకరరావు, సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ ఆజాద్‌లు స్పందించి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో ఓ పేషెంటుకు మేజర్ గుండె శస్త్రచికిత్స జరుగుతుండగా ఓ నెగటివ్ రక్తం అవసరమైందని కందుకూరు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు సంప్రదించగానే వీరిద్దరూ ఒంగోలు వెళ్లి రక్తదానం చేశారు.

న్యూస్ బాక్స్

7న ఉలవపాడు మండల పరిషత్ సమావేశం

ఉలవపాడు, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 7వ తేదీన ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఎస్ విజయ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

కావలిటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్, డాక్టర్ రామ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ రామిరెడ్డి తోట వద్ద ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. న్యూ అగర్వాల్ ఐ కేర్ సెంటర్, విజేత ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి పలువురికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని శస్త్ర చికిత్సలకు నెల్లూరుకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏటూరి రామిరెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, దొడ్ల మనోహర్ రెడ్డి, తాతిరెడ్డి, స్వర్ణలత, సలీమ్‌బేగ్ పాల్గొన్నారు.

ఇరువురి ఘర్షణపై కేసు నమోదు

లింగసముద్రం, మే 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురంలో ఓ ఇంటి స్థలం విషయమై బాబాయి, అబ్బాయి మధ్య శనివారం జరిగిన ఘర్షణపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం నారాయణ సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన జగన్నాథం తిరుపతయ్య తన ఇంటి పక్కన తనకు చెందిన ఖాళీ స్థలంలో తన అన్న కుమారుడు రమేష్‌ను ఇల్లు కట్టుకోమని గతంలో చెప్పాడు. అయితే రమేష్ ఆ స్థలంలో ఇల్లు కట్టుకోకుండా ఆ స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నించాడు. దీనికి తిరుపతయ్య అంగీకరించలేదు. ఈ క్రమంలో రమేష్ ఆ స్థలంలో గుంజలు పాతుతుండగా తిరుపతయ్య అడ్డుకున్నాడు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం జరగడంతో ఇరువురు కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో తిరుపతయ్యకు గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- విరిగి పడిన 11 కేవీ విద్యుత్ స్తంభం
- తాళ్లతో తాత్కాలిక మరమ్మతులు



కావలిరూరల్ : తాళ్లతో కట్టి ఉన్న విరిగిన స్తంభం

కావలిరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుతో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈ గాలులకు కావలి పట్టణం ముసునూరు వికలాంగుల కాలనీలో 11 కేవీ విద్యుత్ స్తంభం విరిగి తీగల మోపున ఊగసాగింది. దీంతో ఒక్క సారిగా మంటలు చెలరేగి విద్యుత్ సరఫరా నిలిచిపో యింది. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్ ఏఈ శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని విద్యుత్ స్తంభాన్ని తాళ్లతో కట్టారు. సోమవారం విరిగిన స్తంభాన్ని తొల గించి నూత న స్తంభం ఏర్పాటు చేస్తామని ఏఈ తెలిపారు.

కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

కొండాపురం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులు బీభత్సం ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. కొమ్మి సబ్‌స్టేషన్ నుంచి సత్యవోలుకు విద్యుత్ సరఫరాకు సంబంధించి 11కేవీ లైను రెండు స్తంభాలతోపాటు పంచాయతీలోని లింగనపాలెంలో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆసమయంలో విద్యుత్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. గడ్డి వాములు సైతం పడిపోయాయి. ట్రాన్స్‌కో సిబ్బంది స్తంభాలు పడిపోయినచోట్ల తాత్కాలిక మరమ్మతులుచేసి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

చిరు జల్లులు

బిట్రగుంట : బోగోలు మండలంలో ఆది వారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి ఆకాశం ఎర్రపడింది. ఉదయం నుంచి భానుడి తీవ్రతతో ఎండ కాసింది. 3 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన ఈదురు గాలులు వీశాయి. మబ్బులు కమ్ముకుని తేలిక పాటి వర్షం కురిసింది. క్షణాలో ఈదురు గాలులు తగ్గడం వాతావరణం యథావిధిగా మారింది.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



లారీ చక్రం కింద నలిగిన వృద్ధుడు రంగయ్య

కందుకూరు, మే 4(ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న నేరెళ్ల రంగయ్య (74) లారీ ఢీకొని మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్‌లో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మహదేవపురంకు చెందిన రంగయ్య సొంత పనిమీద సైకిల్‌పై కందుకూరు పట్టణంకు వచ్చాడు. పోస్టాఫీసు సెంటర్‌లో తన వెనుకే సింగరాయకొండ వైపు నుంచి వస్తున్న లారీని తప్పించుకోవడం కోసం పోస్టాఫీసు కార్నర్‌లో ఓ పక్క సైకిల్ ఆపుకుని నిల్చున్నాడు. అయితే లారీని డ్రైవర్ పోస్టాఫీసు సెంటర్‌లో పామూరు రోడ్డువైపు తిప్పేక్రమంలో రంగయ్యను గమనించకుండా వేగంగా తిప్పడంతో అతనిని ఢీకొనగా కాలుపై లారీ చక్రం ఎక్కింది. దీంతో తీవ్ర గాయాలైన రంగయ్యను చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జలదంకి మండల వైసీపీ అధక్షుడిగా ఇస్కా



ఇస్కా మదన్‌మోహన్ రెడ్డి

జలదంకి, మే 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ ఇస్కా వెంకట్రామిరెడ్డి కుమారుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడి నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ఆదేశాలు అందాయి. కొంతకాలం క్రితం వైసీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసి సాధారణ సభ్యుడిగా కొనసాగుతున్నారు. దీంతో వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇస్కా మదన్‌మోహన్ రెడ్డి పేరు సిఫార్సు చేశారు. ఆయన నియామకంతో కేడర్‌లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతోన్నారు.

అట్టల ఫ్యాక్టరీ వద్ద మంటలు



అట్టల ఫ్యాక్టరీ వద్ద మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని అట్టల ఫ్యాక్టరీ పక్కన నిల్వ చేసిన చెత్తకు ఆదివా రం మంటలు అంటుకున్నాయి. వాతావరణ మార్పులతో వీచిన గాలుల కు ఆ ప్రాంతంలో మంటలతో పాటు దట్టమైన పొగ కమ్ముకుంది. దిగువ న ఉన్న గిరిజన కాలనీ వాసులు ఈ పొగ దెబ్బకు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. గాలికి తగలబడుతున్న ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు ఎక్కడ తమ ఇళ్లపై పడుతాయో నని భయాందోళన చెందుతూ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఇంచార్జి ఫైర్ ఆఫీసర్ జీ.ప్రభాకర్, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పివేశారు. గిరిజన కాలనీకి ఆనుకుని నివాసాల మధ్యన అట్టల ఫ్యాక్టరీ ఉన్నప్పటికీ దాని చుట్టూ ప్రహరీ లేక పోవడంతో పాటు అట్టల తయారీకి సేకరించిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మాత్రం రోడ్డుపై నిల్వ చేస్తున్నారు. ఈ విషయంపై అనేక మార్లు ఫిర్యాదు చేసి ఏస్టీ కమిషన్ దృష్టికి తీసుకు పోవడంతో పొల్యూష న్ బోర్డు అధికారులు పరిశీలించి వెళ్లారు తప్ప దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని గిరిజనులు వాపోతున్నారు.

సీతారాములకు 16 రోజుల పండుగ

బిట్రగుంట, మే 4(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో వెలసి ఉన్న కోదండరామాలయంలో సీతారాముల కల్యాణ అనంతరం ఆదివారం 16 రోజుల పండుగ వేడుకలు జరిగాయి. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్ప కార్యక్రమం జరిగింది. రాత్రి సీతారాముల పల్లకీ సేవ, పూల అలంకరణ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

చలివేంద్రం ప్రారంభించిన ఇంటూరి



మజ్జిగ అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పామూరు బస్టాండ్ ఎన్టీఆర్ కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. దాతలు ఏర్పాటు చేసిన మజ్జిగను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుకు పట్టణ టీడీపీ నాయకులు ముందుకురావటం అభినందనీయమని, భవిష్యత్తులో పార్టీ నాయకులు మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, అత్తంటి శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయస్వామి ఆరాధన



దత్తాత్రేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

లింగసముద్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకోనేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. స్వామి వారి దర్శనార్థం నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచే కాక పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ కోర్కెలు తీర్చిన స్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి దత్త స్వాములచే పండరి భజన, హరిశ్చంద్ర నాటక ప్రదర్శన, అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్ఐలు ఎం.నారాయణ, వెంకట్రావు పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ఆంజనేయ విగ్రహప్రతిష్ఠ అనంతరం ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం

జలదంకి, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుపల్లి పంచాయతీ చింతలపాలెంలోని రామాలయంలో రెండేళ్ల క్రితం పెనుగాలులకు ధ్వజస్తంభం నేలకొరగగా దాని స్థానంలో జీవ ధ్వజస్తంభాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. దీనితో పాటు ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి భారీ విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రతిష్ఠించారు. ఈ రెండు ఘట్టాలను తిలకించేందుకు గ్రాస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులు అన్న ప్రసాద వితర చేశారు. ఈ కార్యక్రమాలకు ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు హాజరు కాగా వేదపండితులు పూర్ణకుంభంతో ఆహ్వానించి స్వామి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాలు కావలి పట్టణంలోని హనుమాత్ క్షేత్ర వ్యవస్థాపకుడు వేదగిరి సూర్యనారాయణచార్యుల బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం



ఇందిరమ్మ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

కావలి, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వాసుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరుతోంది. పేదలు నివశించే ఈ ప్రాంతంలో రోడ్లు లేక ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంగళరావునగర్ కొత్త శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.1.6 కోట్ల మంజూరు చేయించారు. ఈ నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ట్రంకు రోడ్డు నుంచి ఇందిరమ్మ కాలనీకి వచ్చేందుకు కావ్య ఎస్టేట్‌లో నుంచి రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద రైల్వే అండర్ పాస్ నిర్మాణం కూడా చేపడుతున్నారు. అండర్ పాస్ నిర్మాణం నుంచి ఆ రోడ్డు నేరుగా ఇందిరమ్మ కాలనీ వరకు వేసే విధంగా ప్రతిపాదనలు పంపి ఉన్నారు. ఆ ప్రతిపాదనల రోడ్డు కనెక్టివిటీ వరకు ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. అది పూర్తి అయితే ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో రోడ్డు సమస్య పరిష్కారం అవుతోంది.

చెట్టును ఢీకొన్న మోటారు సైకిల్

- తల్లీకూతుళ్లకు తీవ్ర గాయాలు

లింగసముద్రం, మే 4 (ఆంధ్రజ్యోతి) : దైవ దర్శనానికి వెళుతున్న ఓ కుటుంబం ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలైంది. వివరాల మేరకు.. వలేటివారిపాలెం మండలం బంగారక్కపాలెంకు చెందిన గోసు అనూష, తన ఇద్దరి పిల్లలతో కలసి తన బంధువైన ఓ యువకుడితో మోటారు సైకిల్‌పై ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో మండలంలోని మొగిలిచెర్ల దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవానికి బయలుదేరారు. ఆర్ఆర్ పాలెం బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద మోటారుసైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో అందరూ కిదపడగా అనూషకు, ఆమె కుమార్తె జయశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108కి అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లినట్లు 108 సిబ్బంది తెలిపారు.

సిద్దీపురంలో రక్తదాన శిబిరం

సంగం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురంలో యువనేస్తం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం అయింది. మొదట ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గ్రామ యువకుడు, వైద్య విద్యార్థి గుండాల జీవన్ చంద్రారెడ్డికి నివాళులు అర్పించారు. అనంతరం యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు చంద్రకాంత్, నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ నిర్వాహకులు పాల్గొని యువకుల నుండి రక్తం సేకరించారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీతారామపురం ,మే 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ మల్లెల సురేష్, యూనిట్ ఇన్‌చార్జి మాలిబాబు ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 - 26లో భాగంగా రైతులు, మహిళా సభ్యులతో కలిసి గ్రామాల్లో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెమ్మలదిన్నె సర్పంచ్ రామచంద్రయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, లక్ష్మీ ప్రశాంతి, పద్మ పాల్గొన్నారు.

పది, ఇంటర్ ప్రతిభావంతులకు పురస్కారాలు

కావలిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పురస్కారాలు అందజేశారు. బాపూజీనగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగు సాహితీవేత్త అన్నదాత మణి పాల్గొని విద్యార్థులను శాలువాలతో సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, శిరీష దంపతులు, సంఘం కార్యదర్శి ఓరుగంటి రామకృష్ణ, విట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సునీల్, తదితరుల పాల్గొన్నారు.

అంకాళమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

- విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో మంత్రి ఆనం



పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి తదితరులు

వరికుంటపాడు (ఆంధ్రజ్యోతి), మే 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ప్రకాశం జిల్లాల నడుమ పెద్దిరెడ్డిపల్లిలో నిర్మించిన అంకాళమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక ఉత్సవాలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి నిధులు సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తానన్నారు. అలాగే ఆలయ నిర్మాణ దాతలు కోరిన విధంగా తాము కూడా మరికొంత నగదును సమకూర్చేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. తొలుత వరికుంటపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల సూర్యనారాయణ ఘనంగా సన్మానించి స్వామివారి చిత్రపటాలను అందజేశారు. అలాగే ధర్మ వరం గ్రామంలో తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, యూనిట్ ఇన్‌చార్జి నాదిళ్ల రాజేంద్ర పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం

మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఆదివారం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వీపీఆర్ అమృతధార తాగునీటి పథకాన్ని దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి బిందెలతో నీరు పట్టి మహిళలకు అందజేశారు.

- వింజమూరు: మండల కేంద్రంలోని బొమ్మరాజు చెరువు సమీపంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయానికి ఆదివారం పార్టీ ప్రముఖులు విచ్చేశారు. అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి వెళ్లే క్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చెంచలబాబుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మాజీ పోలీస్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంగంలో చిరుజల్లులు

సంగం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

వింజమూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చిత్రలేఖనంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి జ్యోతికొండయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వెంగమాంబ సన్నిధిలో టెండర్ల నిర్వహణ

దుత్తలూరు (ఉదయగిరి), మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు జరుగనుండడంతో భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లపై ఆలయ ఆవరణలో సోమవారం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈ టెండర్లలో పాల్గొనాలని ఆమె కోరారు.

హిందూ ధర్మ పరిక్షణ కోసం పాదయాత్ర



ఉదయగిరికి చేరిన లక్ష్మీపతిస్వామిజీ పాదయాత్ర

ఉదయగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పరిక్షణకై పాదయాత్ర చేపడుతున్నట్లు లక్ష్మీపతిస్వామిజీ పేర్కొన్నారు. నవంబరు 1 2016లో కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఉదయగిరికి చేరుకొంది. స్థానిక విశ్వ హిందూ పరిషత్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిస్వామిజీ విలేఖరులతో మాట్లాడుతూ సనాతన ధర్మంపై ప్రచారం చేస్తూ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల మీదుగా అయోధ్యకు చేరుకుని శ్రీరాముని దర్శించుకున్నట్లు తెలిపారు. తిరిగి తన స్వగ్రామమైన ఉడిపికి వెళుతూ ఉదయగిరికి చేరుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీనివాసరావు, విప్లవ్ కుమార్‌రెడ్డి, గురవయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

మండలానికి పాఠ్య పుస్తకాల సరఫరా

సంగం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలానికి ఆదివారం జిల్లా కేంద్రం నుంచి పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి. వీటిని సంగం జిల్లా ఉన్నత పాఠశాలలోని కాంప్లెక్స్ కేంద్రంలో నిల్వచేశారు. అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేయనున్నారు. జూన్ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలల ప్రారంభం లోపు పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆమేరకు ముందుగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తున్నారు. 90 శాతం పాఠ్య పుస్తకాలు సరఫరా అయినట్లు ఎంఈవో మల్లయ్య తెలిపారు. మిగిలిన పుస్తకాలు త్వరలో వస్తాయన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

దుత్తలూరు (ఉదయగిరి), మ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలరేగడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిసాయి. ఈసందర్భంగా వేద పండితులు స్వామివార్లకు మహా కుంభాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివార్లకు కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా కోదండరాముడి కల్యాణం

సంగం: మండలంలోని జంగాలకండ్రికలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అలంకరించి కల్యాణ వేదిక మీదకు చేర్చి మంగళవాయిద్యాల నడుమ కల్యాణం వైభవంగా జరిగింది.

నాగారపమ్మకు పూజలు

సంగం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా దాసరి

అల్లూరు, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా జనసేన ఎస్టీసెల్ నాయకుడు దాసరి పోలయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు ఓ ఆనంద్ ప్రకటించినట్లు ఆదివారం తెలిపారు. దీంతో అల్లూరు పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.